TRUTH CENTERED TRANSFORMATION

MODULE 2



# దేవుని రాజ్యము

# ఉపాధ్యాయుని సహకారి

Truth Centered Transformation is a ministry of Reconciled World learn more at tctprogram.org

Reconciled World

# సత్యం కేంద్రంగా రూపాంతరం

## కరదీపిక 2

## దేవుని రాజ్యము

## ఉపాధ్యాయుని సహకారి

సత్యం కేంద్రంగా రూపాతంరం అనేది సమాధాన పరచబడిన ప్రపంచం (రికన్సైల్డ్ వర్ల్డ్) వారి పరిచర్య. మరింత తెలుసుకోవడానికి చూడండి.

సత్యం కేంద్రంగా రూపాంతరం – కరదీపిక 2: దేవుని రాజ్యం కాపీరైట్ @2020 వర్షన్ 4. రికన్సైల్డ్వర్ల్డ్, ఫినిక్స్, అరిజోనా, అమెరికా, www.reconciledworld.org

క్రియేటివ్ కామన్స్ అట్రిబ్యూషన్ – షేర్ఎలైక్ 3.0 లైసెన్స్ నిబంధనలకు లోబడి ఈ పుస్తకం అందుబాటులో ఉంది. ఈ క్రింద ఇచ్చిన షరతులతో ఈ పుస్తకాలను మీరు నకలు చేసి, పంచడానికి అనుమతి ఇస్తున్నాము:

**ఆపాదన** – ఈ వాక్యముతో ఈ పుస్తకాన్ని/దీనిలోని అంశాలను మీరు ఆపాదించవచ్చు: కాపీరైట్@2012. క్రియేటివ్ కామన్స్ అట్రిబ్యూషన్-షేర్ఎలైక్ 3.0 లైసెన్స్ నిబంధనలకు లోబడి, రికన్సైల్డ్ (www.reconciledworld.org) వారి ద్వారా ప్రచురించబడిరది. మరింత సమాచారం కోసం www.creativecommons.org చూడండి.

**వ్యాపారేతర వినియోగం కోసం** – ఈ పుస్తకాన్ని వ్యాపారార్థం ఉపయోగించరాదు.

ఈ పుస్తకాన్ని/పుస్తకాలను అనువదించుటకు మీరు ఆసక్తి చూపితే, దయచేసి info@tctprogram.org. సంప్రదించండి.

ప్రత్యేకంగా సూచించకపోతే, ఇందులోని లేఖనాలన్నీ బైబిల్ సొసైటీవారి పరిశుద్ధ గ్రంథం, పాత అనువాదం నుండి స్వీకరించాము.

# మీరు ఆరంభించడానికి ముందు

## ఒక పాఠాన్ని బోధించడానికి సిద్ధపాటు

1. **ఉపాధ్యాయుని సహకారి**ని సాధ్యమైతే అనేకసార్లు జాగ్రత్తగా చదవండి. ముఖ్యమైన విషయాలు మీకు జ్ఞాపకం ఉండేలా పేజీల పక్కన నోట్సు రాసుకోండి లేదా ఆ విషయాల క్రింద గీత గీసుకోండి లేదా హైలైట్ చేసుకోండి.
2. ఆ పాఠం ద్వారా విద్యార్థులు ఏమి నేర్చుకోవాలో అనేది మీకు తెలియడానికి, దానిలోని **ముఖ్యమైన ఆలోచనలు**/విషయాలకోసం చూడండి.
3. **వాక్య భాగాలు** అన్నీ ముందుగానే చదువండి.
4. ప్రతి పాఠంలోను అవసరమైన **వస్తువులు** ఏమిటో చూచుకొని, విద్యార్థుల సహకారిలు (చేతికిచ్చేవి) ఉన్నాయో లేదో చూచుకొని, పాఠంలో ఉపయోగించే దృశ్య సహకార పరికరాలను కనిపెట్టండి.
5. పాఠంలోని **ప్రతి పని** (పోషించే పాత్రలు, ఆటలు, దృశ్య సహకార పరికరాలు) మీరు బాగా ఎరిగి ఉండేలా చూచుకోండి. మీ కుటుంబంతో లేక స్నేహితులతో వాటిని మీరు అభ్యాసం చేయవచ్చు.
6. దేవుడు వారితో ఏమి మాట్లాడుతున్నాడో వినగలుగునట్లు విద్యార్థులను ఆయన సిద్ధపరచునట్లు **ప్రార్థించండి**. అన్ని అంశాలను బోధించడానికి మీకు సహాయం కోసమై కూడా ఆయనను ప్రార్థించండి. ప్రజలు మార్పు చెందడం మనం చూడాలంటే అది కేవలం దేవుని బలంద్వారా మాత్రమే సాధ్యమని గుర్తుంచుకోండి.

## ప్రభావవంతంగా బోధించడానికి సహాయపడే సూచనలు

1. మీరు వాడుకునే ప్రదేశానికి ముందుగా వచ్చి, వాడుకోబోయే అన్ని వస్తువులను సిద్ధం చేసుకోండి.
2. పాఠాలను పూర్తి చేయడానికి తొందరపడకండి. చర్చ, కార్యక్రమాలు, విశ్రాంతి సమయాలకు తగిన సమయం ఉండేలా ప్రణాళిక చేసుకోండి. ప్రజలు అర్థం చేసుకొని నేర్చుకొనే ప్రక్రియలో నిమగ్నమవ్వడానికి సమయమివ్వడం మన లక్ష్యం. అందరికీ అర్థమయ్యేంత వేగంతోనే ఒక అంశంనుండి మరొక అంశానికి వెళ్ళేటట్లు జాగ్రత్తపడండి. కొన్ని మాడ్యూల్స్ పాఠాలకోసం ఒక పూట లేకపోతే ఒక రోజంతా పట్టవచ్చు.
3. తరచుగా సమీక్షించండి. ప్రతి సెషన్‌కు ముందు తర్ఫీదులో వారు అంతవరకు నేర్చుకున్నదంతా సమీక్షించేటట్లు చూడండి. నేర్చుకున్నది గుర్తుండడానికి మరలా మరలా జ్ఞాపకం చేయడం ప్రజలకు సహాయపడుతుంది.
4. ఉపాధ్యాయుని సహకారి, మీరు సిద్ధపరచుకొన్న నోట్సు అనుసరించండి.
5. పాఠంలోని నాలుగు భాగాలూ ఉండేటట్లు జాగ్రత్తగా చూచుకోండి:

   ఎ. అంశాన్ని పరిచయం చేయడం – మీరు సిద్ధపరచిన కార్యక్రమాలు వారికి అంతకు ముందున్న అనుభవాలకు తోడౌతుంది.

   బి. కొత్త సమాచారం ఇవ్వండి – కొత్త సమాచారాన్ని పంచుకోవడానికి అనేక మార్గాలున్నాయి.

   సి. వారు నేర్చుకున్న వాటినుండి చేయడానికి విద్యార్థులకు పని ఇవ్వండి – ఇతరులతో కలసి పనిచేయడం, ఏదైనా ఒక విషయాన్ని కనిపెట్టడం లేక ఏదొక విధానంలో కొత్త సమాచారాన్ని ఉపయోగించడంవల్ల వారు పాఠాన్ని మరింత బాగా అర్థం చేసుకోగలరు.

   డి. పాఠాన్ని వారి జీవితాలతో జతచేయండి – తమ జీవితాలలో వారు నేర్చుకున్న కొత్త సమాచారాన్ని ఏ నిర్దిష్టమైన విధానాలలో అన్వయించుకుంటారో విద్యార్థులు నిర్ణయించుకోవడానికి సహాయపడే దశ ఇది. నేర్చుకొని అన్వయించుకోకుండా ఉండడం ఎలాంటి మార్పును తీసుకురాదు. అది అసలు ఉపయోగపడదు.

6. నిర్వాహకుని మెరుగుచేసే తర్ఫీదులో మీకు నేర్పిన పెద్దలకు నేర్పించే నియమాలు, ఇంకా మిగిలిన నైపుణ్యాలను సమీక్షించుకోండి.

   ఎ. స్పష్టమైన నిర్దేశాలను ఇవ్వండి.

   బి. అవును/కాదు అనే జవాబులు కాకుండా వివరణ చెప్పాల్సివచ్చే ప్రశ్నలు ఎక్కువగా అడగండి.

   సి. వారు పాల్గొన్నందుకు కృతజ్ఞతలు చెప్పండి.

డి. కనుగొనడం ద్వారా వారు మెరుగ్గా నేర్చుకునే విషయాలనుగూర్చి వారికి చెప్పకండి.

ఇ. వారికి అప్పటికే తెలిసిన విషయాలనుండి నేర్పుతూ, వారి అనుభవాలను గుర్తించండి.

ఎఫ్. ఓపికగా ఉండండి. ప్రజలు స్పందించేవరకు ఎదురుచూడండి.

7. చర్చలలో ప్రతి ఒక్కరూ పాల్గొనేటట్లు, పంచుకొనేటట్లు, తమవంతు చెప్పేందుకు ప్రోత్సహించండి. కొంచెం సిగ్గుపడేవారికి వారిని ఇబ్బందిపెట్టకుండా సున్నితంగా ప్రోత్సహించే మార్గాలను వెదకండి.
8. మీకు, విద్యార్థులకు కొత్త విషయాలను దేవుడు బయల్పరచునట్లు రోజంతా ప్రార్థిస్తూ ఉండండి.

## ఈ ఉపాధ్యాయుని సహకారిని ఎలా వాడాలి?

1. **ముఖ్యమైన తలంపులు, వస్తువులు**: ప్రతి పాఠం ఈ భాగంతో ఆరంభమౌతుంది.

ఎ. **ముఖ్యమైన తలంపులు** – ఇవి ప్రతి పాఠం పూర్తయ్యేసరికి విద్యార్థి స్పష్టంగా అర్థం చేసుకోవలసిన అతి ముఖ్యమైన ఆలోచనలు. ప్రతి పాఠం పూర్తయిన తర్వాత విద్యార్థులు ఈ తలంపులను అర్థం చేసుకున్నారో లేదో జాగ్రత్తగా చూచి, పాఠాన్ని సమీక్షించడానికి సమయం తీసుకోండి.

బి. **వస్తువులు** – ప్రతి పాఠంకోసం అవసరమైన నిర్దిష్టమైన వస్తువులు జాబితా ఇచ్చాం. పాల్గొనే ప్రతివారికి ఒక పూర్తి కాపీ ఇవ్వాలనుకున్నా, లేక ప్రతి పాఠంకోసం సూచించబడిన తక్కువ కాపీలు ఇవ్వాలనుకున్నా మీరు ఎంచుకోవచ్చు. మీరు విద్యార్థి సహకారిని వాడకపోతే, వచనాలను, ప్రశ్నలను ఒక బోర్డు లేక చార్టుపై లేదా ప్రతి బృందానికి చిన్న కాగితాలపై రాయవచ్చు. ఎక్కువమందితో కూడిన బృందానికి మీరు బోధిస్తుంటే చార్టులు, వైట్ బోర్డు లేక బ్లాక్ బోర్డును వాడమని మేము సూచిస్తాం.

సి. ఈ ఉపాధ్యాయుని సహకారి వీటిని ఎక్కడ వాడాలో సూచిస్తుంది:

1) **విద్యార్థి సహకారులు** – వీటిని ఇలా గుర్తిస్తాము

2) **దృశ్య సహకారులు** – ఇలా గుర్తిస్తాము.

2. **ఉపదేశకునికి సూచనలు**: తర్ఫీదును చక్కగా నడిపించడానికి మీకు ప్రత్యేకమైన సూచనలు ఉన్నాయి. వీటిని మీరు విద్యార్థులతో చెప్పకూడదు. చర్చలు, కార్యక్రమాలను నడిపించడానికి వీటిని మీరు ముందుగా చదివి సిద్ధపడాలి. కొన్ని ప్రశ్నలకు ఇచ్చిన జవాబులలో కొన్ని వంగివున్న అక్షరాలుగా (ఇటాలిక్స్)కనిపిస్తాయి. అవి ఉపదేశకునిగా మీరు విద్యార్థులకు ఏ ఆలోచనలను నొక్కి చెప్పాలో మీకు తెలియజేస్తాయి.
3. **సమయపాలన**, పాఠం జరిగే వేగాన్ని నిర్వహించడం: ప్రతి పాఠానికి సమయం ఇంత అని ఇవ్వలేదు.

ఎ. పాఠంలోని తలంపులను నేర్చుకోవడానికి ఎంత సమయం కావాలంటే అంత సమయం తీసుకోండి. నియమిత సమయంలో పాఠం పూర్తి చేయడంకంటే విద్యార్థులు ఏమి నేర్చుకుంటున్నారు అనేదే విలువైనది.

బి. బోధించేవారు ధ్యానములతో, సాక్ష్యాలు పంచుకోవడంతో, వారికి సమస్యలేమైనా ఉంటే వాటిగురించి చర్చించడానికి, కలసి ప్రార్థించడానికి సమయం ఉండేటట్లు జ్ఞాపకం ఉంచుకోండి.

# పాఠం 1: దేవుని రాజ్యం

### ముఖ్యమైన తలంపు

ఎక్కడ యేసు రాజుగా ఉండి, ఆయన నియమాలు/సూత్రాలు అనుసరిస్తారో అక్కడ దేవుని రాజ్యం ఉన్నట్లు. దేవునికి విధేయులవ్వడానికి మరింతమంది ప్రజలు వచ్చి, మనం మరింత పరిపూర్ణంగా దేవునికి విధేయులమవ్వడంతో దేవునిరాజ్యం విస్తరిస్తుంది.

**వస్తువులు** : ఏమీ లేవు

### దేవుని రాజ్యం అంటే ఏమిటి?

---

### పెద్దబృందంతో చర్చ

యేసు భూమిమీద సంచరించినపుడు, ఆయన తన ప్రణాళికను చెప్పాడు. ఈ ప్రణాళిక కొత్త నిబంధనలో 98సార్లు పేర్కొన్నారు. తాను పంపబడడానికి పూర్తికారణం అదేనని యేసు చెప్పాడు. దానిగురించి బోధించడానికే ఆయన తన శిష్యులను కూడా పంపాడు. పౌలు దానిగూర్చి మాట్లాడాడు. దానికోసం ప్రార్థన చేయడానికి మనం ప్రోత్సహించబడుతున్నాం.

- అది ఏమిటో మీకు తెలుసా?

### చిన్న బృందంతో చర్చ

కింది వచనాలు చదివి ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి:

- మత్తయి 10:5-8 – ఏమి బోధించడానికి యేసు తన శిష్యులను పంపాడు?
- లూకా 4:43 – యేసు ఎందుకు పంపబడ్డాడు?
- అపో.కా. 1:3 – భూమిమీద తాను ఉన్న చివరి 40రోజులు యేసు ఏమి బోధించాడు?
- అపో.కా. 28:30-31 – పౌలు దేనిగూర్చి బోధించాడు?

### సమీక్ష సమయం/పునశ్చరణ

దేవుని రాజ్యం కట్టడమే దేవుని ప్రణాళిక. యేసు, పౌలు నేర్పించిన ముఖ్యమైన ఆలోచన ఇదే అని మనం ఈ వచనాల్లో చూస్తాం. నిజానికి, యేసు భూమిమీద ఉన్న చివరి 40 రోజులు ఆయన ఈ అంశాన్నిగూర్చి మాత్రమే బోధించాడు. ప్రజలకు నేర్పించడానికి మీకు 40రోజుల సమయం మాత్రమే ఉందని మీకు తెలిస్తే, మీరు చాల ముఖ్యమైన విషయాన్నే బోధిస్తారు అనేది స్పష్టం కదా! కాబట్టి అది మనకు కూడా చాలా ప్రాముఖ్యమైనది. అయితే మనలో అనేకులకు ''దేవుని రాజ్యం'' అనే మాట అర్థం కాదు.

### ఇద్దరిద్దరు చేసే పని

- ఒక కొత్త క్రైస్తవునికి దేవుని రాజ్యాన్ని నీవు ఎలా వర్ణిస్తావు?

### నివేదించే సమయం

నిజానికి దేవుని రాజ్యాన్నిగూర్చి వర్ణించడం కష్టమైన పనేమీ కాదు. ఎక్కడ యేసు రాజుగా ఉంటాడో, ఆయన నియమాలు ఎక్కడ పాటించబడతాయో అదే దేవుని రాజ్యం. ఎక్కడ ప్రజలు దేవునికి విధేయులుగా నడుచుకుంటూ, ఆయన కోరికలను అనుసరిచడం మనం చూస్తామో, అది దేవుని రాజ్యంలోని చిన్నభాగం అన్నమాట. యేసు తిరిగి వచ్చి, పాపాన్ని పూర్తిగా తొలగించి, అన్నిటినీ నూతనపరచేవరకు దేవుని రాజ్యం పరిపూర్ణంగా వచ్చినట్లు కాదు.

### యేసు మన రాజు

---

### పెద్ద బృందంతో చర్చ

- సాధారణంగా ఒక రాజు ఎలా ప్రవర్తిస్తాడు?
- యేసు ఒక భూరాజువంటివాడని నీకు అనిపిస్తుందా? పోలికలు ఏమిటి? బేధాలు ఏమిటి?

యేసు ప్రేమగల రాజు. ఆయన సమస్తాన్ని ఎరిగినవాడు. ఆయన సర్వశక్తిమంతుడు. ఆయన లోకాన్ని సృష్టించాడు. ఆయనకు సంపూర్ణ జ్ఞానం ఉంది. అన్నీ బాగా ఎలా పనిచేస్తాయో ఆయనకు తెలుసు. లోకానికి, అందులో ఉన్న మనందరికీ ఏది ఉత్తమమైనదో అది ఇవ్వాలని ఆయన కోరుతున్నాడు. ఆయన నియమాలు మన మేలుకే.

థాయ్‌లాండ్ గతకాలపు రాజునుగూర్చిన ఈ కథ వినండి.

థాయ్‌లాండ్ ఒక రాజ్యం! ముందటి రాజైన భూమిబాల్ అదుల్యదేజ్ చాలా అద్భుతమైన రాజు. ప్రజలందరూ అతనిని ప్రేమించేవారు. ఇప్పుడు అతడు మరణించినా ప్రజలు అతన్నిగూర్చి గొప్ప ప్రేమగా మాట్లాడుకుంటారు. తనకు పసుపురంగు ఇష్టమని అతడు చెప్పేవాడు. కాబట్టి ప్రతి సోమవారం ప్రజలంతా పసుపురంగు చొక్కాలు వేసుకునేవారు. తన భార్యకు ఊదారంగు ఇష్టమని అతడు చెప్పగా, శుక్రవారాలు అనేకమంది ప్రజలు ఉదారంగు చొక్కాలు వేసుకునేవారు. ప్రజలు అతనిని **ఎంతగా ప్రేమించి అభిమానించేవారంటే**, ఒక రంగు తనకు ఇష్టమని చెబితే చాలు ప్రజలు వేసుకునే దుస్తుల రంగులమీద ప్రభావం చూపేది.

అతని పాలనలో ఒకసారి థాయ్‌లాండ్ ప్రభుత్వాన్ని సైన్యం ఆక్రమించారు. వీధుల్లో యుద్ధం జరిగింది. ప్రభుత్వాన్ని సమర్థించేవారు సైన్యాన్ని సమర్థించేవారితో పోరాటం చేశారు. అది చాలా గంభీరంగా మారిపోవచ్చునని అందరూ భావించారు. అప్పుడు రాజు ప్రకటన ఇచ్చాడు. పోరాటం ఆపి ఎన్నికలకు సిద్ధపడమని రాజు అందరికీ ఆదేశించాడు. వెంటనే యుద్ధం ఆగిపోయింది. రాజును ఎవరూ ప్రశ్నించలేదు. అందరూ అతడు చెప్పినట్లు చేశారు. వారికి కోపం ఉన్నాసరే, రాజుమాటలనుబట్టి వారి కోపాన్ని అణచుకున్నారు. రాజు చెప్పాడు. తమకున్న భావాలకన్నా రాజును సంతోషపెట్టడం మరింత ముఖ్యమైనదిగా వారు భావించారు.

- రాజు కోరికలు ప్రజల ప్రవర్తనపై ఎలా ప్రభావాన్ని చూపాయి?
- ఇలాంటి రాజు మీకెవరైనా తెలుసా?
- ప్రజలు రాజు మాటను ఎందుకు విన్నారు? భయంతోనా లేక ప్రేమతోనా?
- థాయ్ ప్రజలు తమ రాజుతో వ్యవహరించినట్లు మనం రాజైన యేసుతో వ్యవహరిస్తున్నామా? మనం చేసే ప్రతి పనిలో ఆయనను సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తున్నామా?

దేవుని రాజ్యంలో మనం భాగమై ఉన్నాం. యేసు మన రాజు. థాయ్‌లాండ్ ప్రజలు తమ రాజును సంతోషపెట్టడానికి ప్రయత్నించినట్లు మన రాజైన యేసు చెప్పినట్లుగా చేసి మనం ఆయనను సంతోషపెట్టడానికి ప్రయత్నించాలి. తనకు ఒక రంగు నచ్చింది అని చెప్పిన థాయ్‌లాండ్ రాజు మాటలు ప్రజలమీద అంత ప్రభావం చూపేటట్లుగా ప్రజలు అతన్ని ప్రేమిస్తే, మన రాజైన యేసుపట్ల మనకున్న ప్రేమ మన జీవితాలను మరింతగా ప్రభావితం చేయవద్దా?

## తన రాజ్యాన్ని కట్టడానికి దేవుని పిలుపు

### పెద్ద బృందంతో చర్చ

మత్తయి 6:9-10 చదవండి.

- మనలను దేనికోసం ప్రార్థించమని యేసు చెప్పాడు?
    - *ఆయన రాజ్యం వచ్చునట్లు, ఆయన చిత్తం నెరవేరునట్లు.*

భూమిమీద తన రాజ్యాన్ని కట్టాలని దేవుడు కోరుతున్నాడు. మనం దేవుని రాజ్యాన్ని కట్టడానికి రెండు ముఖ్యమైన మార్గాలున్నాయి.

1. అనేకమంది ప్రజలు రక్షణపొంది దేవుని రాజ్యంలో రక్షణపొందినవారి సంఖ్య పెరగడం
2. ప్రజలద్వారా దేవుని చిత్తం మరింత ఎక్కువగా జరగడం.

దేవుని చిత్తం మరింతగా జరగడం చూడాలని మనం కోరుకుంటే, ఎక్కువమంది ప్రజలు దేవునికి విధేయులవ్వడం మనం చూడాల్సివుంటుంది. మన జీవితాలలోని అన్ని విభాగాలలో దేవుడు ఉద్దేశించినట్లుగా మనం జీవించాల్సివుంటుంది. రానున్న రోజుల్లోని మన తర్ఫీదులో సువార్తీకరణను గూర్చి మనం వివరంగా చూడబోతున్నాం. అయితే క్రైస్తవులు కానివారికి యేసునుగూర్చిన సువార్త చెప్పాల్సిన అవసరం ఉందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవడం ఇప్పటికి ముఖ్యమైన విషయం.

## 'అన్ని' విషయాలలో విధేయతకై దేవుని పిలుపు

### పెద్ద బృందంతో చర్చ

కొలస్సీ 3:17 & 1కొరింథి 10:31 చదవండి.

మనం ఎల్లప్పుడూ దేవుని ఘనపరచి, సంతోషపరచాలని దేవుడు కోరుకుంటున్నాడు. మనం ఏమి చేసినా, అది దేవునికి మహిమను తెచ్చేలా చేయాలని ఈ వచనం మనకు తెలియజేస్తుంది. '**మీరేమి చేసినను**' అనే ఆలోచన రెండు వచనాల్లోనూ పునరావృతమైంది. కొలస్సీ పత్రికలో: '**మాటచేత గాని క్రియచేత**గాని మీరు ఏమిచేసినను, ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయపేరట చేయుడి'' అని చెబుతుంది. కొరింధీ పత్రికలో: 'కాబట్టి మీరు **భోజనము చేసినను పానము చేసినను** మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమకొరకు చేయుడి' అని చెబుతుంది. మనం చేసే ప్రతిదీ దేవునికి మహిమ తీసుకురావడానికే చేయాలని మనం అర్థం చేసుకోవడానికి పౌలు ఈ విషయాన్ని మరలా మరలా చెప్పాడు.

- మనం తినే విధానంలో మనం దేవునికి మహిమ ఎలా తీసుకురాగలం అని మీకు అనిపిస్తుంది.
  - *నసుగుతూ/ఫిర్యాదులు చేస్తూ తినడం కాకుండా కృతజ్ఞతతో తినడం. మనకున్నదాన్నిబట్టి దేవునికి కృతజ్ఞతలు చెల్లించడం ద్వారా.*
  - *మీరు తింటున్నపుడు ఒకరినొకరు ప్రోత్సహించుకోవడంద్వారా.*
  - *తినడానికి తగినంత లేనివారిని లేక ప్రోత్సాహం అవసరమైనవారిని మీతో కలసి భోజనం చేయడానికి ఆహ్వానించడంద్వారా.*
  - *ఉన్న ఆహారం కుటుంబ సభ్యులమధ్య న్యాయంగా పంచుకొనేటట్లు చూడడంద్వారా.*

### చిన్న బృందంతో చేయాల్సిన పని

***బోధకునికి సూచనలు:*** *కింది పట్టికను బోర్డుపై గీయండి. మొదటి రెండు ఉదాహరణలు కలసి చేయండి. తరువాత క్లాసు అంతా కలసి మరొక 10 సామాన్య కార్యక్రమాలు రాయడానికి కలసి ప్రయత్నించండి. క్లాసును చిన్న బృందాలుగా విభజించి రెండు, మూడు గడులలో ఏమి రాస్తారో చర్చించడానికి ఒక్కొక్క చిన్న బృందానికి కొన్ని కార్యక్రమాలను ఇవ్వండి.*

ప్రతి కార్యక్రమానికి ఈ కింది విషయాలనుగూర్చి ఆలోచించండి:

- ఈ పని చేస్తున్నవారి సాధారణ వైఖరి ఏమిటి?
- దేవునికి మహిమ తీసుకువచ్చునట్లుగా దాన్ని మీరు ఎలా చేయగలరు?

| కార్యక్రమం | సాధారణ వైఖరి | దేవుని మహిమపరచే భవిష్యత్ కార్యాచరణ |
|---|---|---|
| గిన్నెలు కడగడం లేక బట్టలు ఉతకడం | సణుక్కుంటూ త్వరగా చేయడం | సాధ్యమైనంత శుభ్రంగా చేయడానికి నేను మరింతగా కృషి చేస్తాను. నేను పని చేయగలుగుతున్నందుకు, ఈ పని ఆయనకు మహిమ తెచ్చునట్లు దేవుని స్తుతిస్తూ పాటపాడతాను. |
| పొలములో కలుపుతీయడం | అది కష్టమైన పనికాబట్టి కలుపు మొక్కలు చాలా మిగిలిపోయాయి. తరచు ప్రజలు ఆలస్యంగా ఆరంభించి పనిపూర్తి చేయకుండానే ముగించేస్తారు. | నేను పని త్వరగా ఆరంభించి కలుపుమొక్కలన్నీ తీసేస్తాను. నేను పనిచేస్తున్నపుడు దేవుని స్తుతిస్తూ పాటలు పాడి, నా కుటుంబం కోసం నా దేవునికోసం నేను ఒక పని చేయగలిగినందుకు గర్విస్తాను. |

### ముగింపు

యేసు మనకు రాజు. ఆయన ప్రేమ, శక్తి, జ్ఞానం గల రాజు. తన ప్రజలకు బహుశ్రేష్టమైనది ఇవ్వాలని ఆయన కోరుకుంటాడు. ఆయన అనుచరులముగా మన జీవితాలలోని ప్రతి విభాగంలో ఆయన నియమాలకు మనం విధేయత చూపుతాము. ఆ నియమాలలో ఒకటి మనమేమి చేసినా ఆయన మహిమకోసం చేస్తాము అనేది.

### వ్యక్తిగతంగా తలపోయడానికి

అనుదిన కార్యక్రమాల జాబితాను సమీక్షించండి. మీరు ప్రతి దినం చేసే పనుల్లో దేవునికి మరింత మహిమ తెచ్చే రెండు పనులు ఎంచుకోండి. రానున్న కొద్ది నెలలు ఈ విషయాలపై దృష్టిపెట్టడానికి నిశ్చయం చేసుకోండి.

### ప్రార్థన

దేవుడు తన రాజ్యాన్ని కట్టడానికి, మన ప్రణాళికలు ఆచరణలో పెట్టడానికి సహాయం చేయునట్లు ప్రార్థించడానికి సమయం తీసుకోండి.

# పాఠం 2: దేవుని రాజ్య సంస్కృతి

### ముఖ్యమైన తలంపు

దేవుని రాజ్య ప్రజలుగా ఎలా జీవించాలో బైబిల్ మనకు బోధిస్తుంది.

### వస్తువులు

1. విద్యార్థి సహకారి: దేవుని రాజ్య విలువలు పత్రం (ప్రతి బృందంకోసం దీన్ని ప్రింట్ చేయండి)

### మొదటిగా దేవుని రాజ్యమును వెదకుడి

### పెద్ద బృందంతో చర్చ

మత్తయి 6:25–33 చదవండి.

- ప్రజలు వేటిగురించి చింతపడుతున్నారు?
- అవి ఆత్మీయమైన విషయాలా లేక సాధారణమైన విషయాలా?
- యేసు స్పందన ఏమిటి?
- యేసు భావం ఏమిటని మీరు తలస్తున్నారు? ప్రతి విషయంలో దేవుని రాజ్యాన్ని మనం ఎలా వెదకగలం?

ఏమి తినాలి, ఏమి త్రాగాలి అనే విషయాలనుగూర్చి తమకు చింత ఉన్నదని చెప్పడానికి ప్రజలు యేసువద్దకు వచ్చినపుడు, వారికి జవాబిస్తూ 'దేవుని రాజ్యమును మొదటిగా వెదకుడి' అని యేసు చెప్పడం కొంచెం గందరగోళంగా అనిపించవచ్చు. దాని అర్థం ఏమిటి? మనం అసలు ఈ విషయాలనుగూర్చి తలంచకూడదనా దాని భావం? ప్రార్థించడం వంటి ఆత్మీయ కార్యాలకే మన సమయం అంతా వెచ్చించాలని దాని అర్థమా? మనం అలా చేస్తే అది పరిపూర్ణమైన జీవితం అవుతుందా?

అయితే భాగ్యవశాత్తు పరిపూర్ణమైన జీవితాన్ని జీవించి, అన్నివేళలా దేవుని చిత్తాన్ని చేసిన ఒకరు మనకు మాదిరిగా ఉన్నారు: ఆయనే యేసు (యోహాను 14:31). దేవుని రాజ్యాన్ని మొదటిగా వెదకడం అంటే ఏమిటో తెలుసుకోవడానికి మనకున్న మార్గాలలో ఒకటి ఆయన జీవితాన్ని చూడడమే.

### చిన్న బృందంతో చర్చ

ఈ వచనాలను చూడండి. యేసు చేసిన కొన్ని పనులనుగూర్చి అవి మనకు ఏమి నేర్పిస్తాయి?

- మార్కు 6:3 – *యేసు ఒక వడ్రంగి.*
- యోహాను 21:9–*14 – యేసు తన శిష్యులకోసం ఆహారం వండాడు.*
- మార్కు 1:35 – *యేసు ఒంటరిగా ప్రార్థించాడు.*
- మార్కు 4:38 – *యేసు విశ్రాంతి తీసుకున్నాడు.*
- యోహాను 2:1–2 – *యేసు ఒక వివాహానికి హాజరయ్యాడు.*
- మార్కు 2:15 – యేసు ఒక స్నేహితుని ఇంట భోజనం *చేశాడు. (ఇంకా అనేకమంది అక్కడ ఉన్నారు. అది ఒక సాయంకాలపు విందు.)*
- మత్తయి 14:14 – *యేసు ప్రజలను స్వస్థపరచాడు.*
- మార్కు 1:39 – *యేసు ప్రయాణం చేసి, బోధించి, దయ్యాలను వెళ్ళగొట్టాడు.*

జనసమూహాలకు బోధించడం మొదలు శిష్యులకోసం భోజనం సిద్ధపరచడం, ఒక వడ్రంగిగా ఉండంతో సహా యేసు అన్ని పనులూ చేశాడు. కేవలం బోధిస్తున్నపుడు లేక స్వస్థపరస్తున్నపుడు మాత్రమే కాక ఈ పనులు చేస్తున్నపుడు కూడా ఆయన పరిపూర్ణమైన జీవితాన్ని జీవించాడు. తన జీవితంకోసమైన దేవుని చిత్తాన్ని దాటి బయటికి వెళ్ళిన క్షణం యేసు జీవితంలో ఏనాడూ లేదు.

మనం 'దేవుని రాజ్యాన్ని మొదటగా వెదకడా'నికి ప్రయత్నం చేయడం అంటే ఎల్లప్పుడూ కేవలం ప్రార్థన చేయడం లేదా ప్రసంగం చేయడం మాత్రమే కాదు. మనం చేసే ప్రతి విషయం దేవుని సంతోషపరచేటట్లుగా, ఆయనకు మహిమ తెచ్చేటట్లుగా చేయడము అని దాని అర్థం.

### మనకు ఆధారం/వనరు

### పెద్ద బృందంతో చర్చ

- దేవుని సంతోషపెట్టే విధానాలలో జీవించడం మనం ఎలా నేర్చుకోవచ్చు?
  - *బైబిల్!*

కొన్నిసార్లు మనం ఏదైనా విలువైన వస్తువు కొన్నపుడు, దాన్ని ఎలా వాడాలో తెలియజేసే సూచనలున్న పుస్తకాన్ని కూడా మనకు ఇస్తారు. ఆ వస్తువును రూపొందించి, తయారుచేసిన కంపెనీవారు ఆ పుస్తకాన్ని రాస్తారు. అది చక్కగా ఎలా పనిచేయడానికి ఎక్కువకాలం మన్నడానికి దాన్ని ఎలా ఉపయోగించాలో వారికి తెలుసు. మనం కొనుక్కున్న కొత్త వస్తువు చక్కగా, ఎక్కువకాలం పనిచేయాలని మనం ఆశిస్తే ఆ సూచనల పుస్తకాన్ని చదవడం శ్రేష్టమైన మార్గం.

దేవుడు కూడా అంతే. ఈ లోకాన్ని ఆయనే రూపొందించి, సృష్టించాడు. మనలను రూపించి, సృష్టించినవాడు కూడా ఆయనే. మన జీవితాలు, ఈ ప్రపంచం అత్యుత్తమంగా ఉండాలంటే ఏమి చేయాలో అది ఆయనకే తెలుసు. ఆయన ఆ విషయాలను మనకోసం సూచనలుగా రాసి మనకిచ్చాడు. దాన్ని మనం బైబిల్ అని పిలుస్తాం. మన జీవితాలలోని ప్రతి విభాగంలో మనం ఎలా జీవించాలో దానిలో ఆయన మనకు చెబుతాడు. చెడిపోయి పగిలిపోయిన మన లోకం, సమాజాలను బాగుచేసుకోవడానికి మనకు కావలసిన జ్ఞానము, సూచనలన్నీ బైబిల్లో ఉన్నాయి. మన జీవితాలలోని ప్రతి విభాగంలో సాధ్యమైనంత శ్రేష్టమైన రీతిలో జీవించాలని, మన సమాజం మార్పు చెందడం మనం చూడాలని ఆశిస్తే మనం బైబిల్లో రాసివున్నవి చదివి, అర్థం చేసుకుని, మన జీవితాలకు అన్వయించుకోవాల్సి ఉంది.

### చిన్న బృందంతో చర్చ (అవసరమైతేనే)

- బైబిల్లో మీరు చూచిన కొన్ని సూచనలు, నియమాలు లేక ఆజ్ఞలు ఏమిటి?
- ఈ సూచనలు మన మేలుకోసమే కావచ్చు అని మీరు ఎందుకు భావిస్తున్నారు?

### నివేదించే సమయం

## మన జీవితంలోని ప్రతి విభాగానికి బైబిల్‌ను అన్వయించుట

మనం దేవుని సంతోషపెట్టేటట్లుగా జీవించే మార్గాన్ని తెలియజేయడానికి దేవుడు మనకు బైబిల్‌ను ఇచ్చాడు. మన జీవితంలోని ప్రతి విషయంలో మనం దేవునికి విధేయులు కావాలంటే బైబిల్ మనకు ఏమి బోధిస్తుందో అది మనం అర్థం చేసుకోవాల్సి వుంది. అది మన ఆచారాలు లేక సంస్కృతులవలె ఉంటుందా లేక భిన్నంగా ఉంటుందా? ఈ భూమిమీద దేవుని రాజ్యాన్ని మనం కట్టబోతున్నట్లయితే మనం దేవుని మార్గాలను తెలుసుకోవాల్సిన అవసరత ఉంది.

### చిన్న బృందంతో కార్యక్రమాలు

***బోధకునికి సూచనలు:*** *పెద్ద బృందంతో మొదటి వరుసను ఉదాహరణగా చేయడంతో ఆరంభించండి. తరువాత చిన్న బృందాలుగా విభజించండి. ఒక్కొక్క బృందానికి 3లేక 4 వరుసల పనిని ఇవ్వండి. ఒకవేళ వాళ్ళు త్వరగా ముగిస్తే, అప్పుడు మరికొన్ని వరుసలు నింపవచ్చని వారికి చెప్పండి.*

**విధ్యార్థి సహకారి**లోని పట్టికలు నింపండి. ప్రతి అంశానికి మీ సంస్కృతి సామాన్యంగా ఏమి చెబుతుందో ఆలోచించండి. తరువాత వచనాలను చదివి మనం ఏమి చేయాలని బైబిల్ చెబుతుందో చూడండి.

### నివేదించే సమయం

చిన్న బృందాలు పూర్తి చేసిన తర్వాత, పట్టికలోని ఒక్కొక్క వరుసను చదవండి. ఆ వరుసను నింపిన బృ:దాలవారు ఏమి నింపారో చెప్పమనండి.

| విలువ | లేఖనం | మన సంస్కృతి /ఆచారం | దేవుని రాజ్యం |
|---|---|---|---|
| నాయకులు ఎలా ప్రవర్తించాలి | మత్తయి 20:25-28 | ప్రజలు నాయకులకు సేవచేస్తారు. ప్రజలు ఏమి చేయాలో నాయకులు వారికి చెబుతారు. | నాయకులు ప్రజలకు సేవచేస్తారు. |

| | | | |
|---|---|---|---|
| ఒక భర్తలా మనం ఎలా ప్రవర్తించాలి | కొలస్సీ 3:19, 1పేతురు 3:7, ఎఫెసీ 5:25,28,33 | | |
| ఒక భార్యలా మనం ఎలా ప్రవర్తించాలి | ఆది 2:18, ఎఫెసీ 5:22-24,33 | | |
| మనం పిల్లలతో ఎలా ప్రవర్తించాలి | కీర్తన 127:3, ఎఫెసీ 6:4 | | |
| ప్రజలతో ఎలాప్రవర్తించాలి | మత్తయి 22:36-40, లూకా 10:25-37 | | |
| శత్రువులతో ఎలా ప్రవర్తించాలి | లూకా 6:27-31 | | |
| పనిపట్ల మన వైఖరి | కొలస్సీ 3:22-4:1, ఎఫెసీ 6:7-8 | | |
| పరిసరాలపట్ల మన వైఖరి | కీర్తన 24:1, ఆది 1:28-30, ఆది 2:15 | | |
| అన్నిటికన్నా ముఖ్యమైనది | మత్తయి 6:25-34, మత్తయి 22:36-40 | | |
| మరణం గూర్చి మన వైఖరి | యోహాను 11:25-26, హెబ్రీ 2:14-15, ప్రక 1:17-18 | | |
| శ్రమలనుగూర్చి మన వైఖరి | లూకా 6:22-23, 2కొరింథి 1:8-11 | | |

**పెద్ద బృందంతో చర్చ**

- మీ సంస్కృతిలోనివి, దేవుని రాజ్యంలోనివి ఒకేలా ఉన్నవి ఏమిటి? ఏవి పూర్తిగా భిన్నమైనవి?
- మన సంస్కృతిలోనివి, బైబిల్ చెప్పేవి భిన్నంగా ఉన్న మరికొన్ని విషయాలనుగూర్చి ఆలోచించగలరా?
- మనం ఏమి చేయాలని బైబిల్ చెబుతుందో అలా మన జీవితాలు ప్రతిబింబించడానికి మన జీవితాలలో మార్పులను ఎలా ఆరంభించవచ్చు?

**ముగింపు**

మన సంస్కృతులనుగూర్చి చాలా అద్భుతమైన సంగతులు ఉన్నాయి. కొన్ని సంస్కృతులు ఒకరికొకరు సేవచేయాలని బోధిస్తాయి. కొన్ని కుటుంబానికి ఉన్న ప్రాముఖ్యతను, పెద్దలపట్ల శ్రద్ధను బోధిస్తాయి. కొన్ని మనకు దేవుడు ఇచ్చిన వాటిని ఉపయోగించుకుని కష్టపడేతత్వాన్ని ప్రోత్సహిస్తాయి. కాని అన్ని సంస్కృతులలో బైబిల్‌తో ఏకీభవించని కొన్ని విషయాలు కూడా ఉన్నాయి. మనం దేవునికి విధేయులుగా నడవాలంటే, బైబిల్లోని ఏ విషయాలకు మన సంస్కృతి భిన్నంగా ఉందో చూడాల్సిన అవసరం ఉంది. మీరు మీ సంస్కృతినే అనుసరిచండం కాక బైబిల్ బోధించే విధంగా ఉండడం ఎలాగు అనే విషయాన్నిగూర్చి ఆలోచించండి.

ఇంతకుముందు మనం చేసిన పట్టికను చూడండి: మీరు వ్యక్తిగతంగా మారడానికి ప్రయత్నించే విషయాలు ఒకటి లేక రెండు ఉన్నాయా?

# పాఠం 3: పనినిగూర్చి బైబిల్‌ను అనుసరించిన అవగాహన

**ముఖ్యమైన తలంపు**: అన్ని రకాల పనులు దేవునికి మహిమ తీసుకురాగలవు. దేవుని ఘనపరచే విధానాలలో మనం మన పనిని చేయాల్సివుంది.

**వస్తువులు**

1. విద్యార్థి సహకారి: పనినిగూర్చిన బైబిల్ అవగాహనకు సంబంధించిన ప్రశ్నలు

## పరిచయం

**పెద్ద బృందంతో చర్చ**

- సాధారణంగా పని చేయడం మంచిదని భావిస్తారా లేక చెడ్డదని భావిస్తారా?
- పనిని గూర్చి మీ భాషలో ఉన్న కొన్ని సామెతలు ఏమిటి?

ఆది 1:28 చదవండి.

- ఆదాముకు దేవుడు ఇచ్చిన సూచనలలో మొదటిది ఏమిటి?
- అది ఎప్పుడు? తినవద్దన్న ఫలము తిని పాపం చేయడానికి ముందా లేక తరువాతా?

ఆది 2:2 చదవండి.

- దేవుడు దేనినుండి విశ్రాంతి తీసుకున్నాడు?

మార్కు 6:1–3 చదవండి.

- బోధించడం ఆరంభించడానికి ముందు యేసు వృత్తి ఏమిటి?

ఈ వచనాలను మనం చూచినప్పుడు దేవుడు పనిచేశాడని, మనం దేవుని పోలికలో చేయబడ్డాం కాబట్టి మనం కూడా పనిచేయడానికే చేయబడ్డామని గమనించవచ్చు. కాలం ఆరంభమైనప్పటినుండి, పాపం ఈలోకంలోనికి ప్రవేశించడానికి ముందునుండి మనిషి పనిచేశాడు.

## పనిచేయడం గౌరవం

రూతు గ్రంథంలో, అత్తతోపాటు కరవునుండి తప్పించుకున్న రూతు చాలా పేద విధవరాలు. బెత్లెహేములో ఆహారమున్నదని విని వారు మోయాబునుండి తిరిగివచ్చారు. బోయజు పొలములో రూతుకు పని దొరికింది. అతనికి రూతుపై ఆసక్తి కలిగి, ఆమె తన అత్తకు చేసినదాన్ని గూర్చి తెలుసుకుంటాడు.

రూతు 2:15–16 చదవండి.

- రూతుకు సహాయం చేయడానికి బోయజు ఏమి చేశాడు?
- అతడు ఆమెకు గోధుమలు ఎందుకు ఇవ్వలేదని మీకనిపిస్తుంది?
  - *ఎందుకంటే మనం పనిచేయడంకోసం రూపించబడ్డాం. కాబట్టి మనం దానంగా పొందడంకంటే పని చేసి సంపాదించడాన్ని గౌరవంగా భావిస్తాం. ఇలా చేయడంద్వారా బోయజు రూతుకు గౌరవాన్ని కల్పించాడు.*

## మనం శ్రద్ధగా పనిచేయాలని దేవుడు ఉద్దేశిస్తున్నాడు

**చిన్న బృందంతో చర్చ**

***బోధకునికి సూచనలు:*** *చిన్న బృందంతో చర్చకోసం* ***విద్యార్థి సహకారిని*** *ఉపయోగించండి.*

పని చేయడానికి కొన్ని కారణాలు ఏవి? క్రింది వచనాలు చదవండి. ఇంతవరకు ఈ పాఠంలో ఏమైనా తలంపులు ఉన్నాయా చెప్పండి.

- 1థెస్స 4:11–12 – *నీ జీవితం ఇతరుల గౌరవాన్ని సంపాదిస్తుంది, నీవు ఇతరులపై ఆధారపడేవాడిగా ఉండవు.*
- 1తిమోతి 5:8 – *నీ కుటుంబాన్ని పోషించడానికి*
- ఎఫెసి 4:28 – *అవసరతలో ఉన్నవారికి ఏమైనా ఇవ్వడానికి నీవద్ద ఉండాలి.*

## నివేదించే సమయం

**పెద్ద బృందంతో చర్చ**

- మనం పనిచేయడం దేవుని ఉద్దేశమని మీరు తలస్తున్నారా?
- పనిపట్ల ప్రజలు ఎలాంటి వైఖరిని కలిగివుంటారు?
- పనిగురించి మనం ఎలాంటి వైఖరి కలిగివుండాలని మీరు తలస్తున్నారు?

మనందరము పనిచేయాలనేది దేవుని ఉద్దేశం. పాపం లోకంలోనికి ప్రవేశించడానికి ముందే ఆదాముకు తోటలో చేసే పని ఉద్యోగంగా ఇవ్వబడిరది. మనం పనిచేసినప్పుడు మన కుటుంబాలను పోషించగలం, పేదలకు, సంఘానికి ఇవ్వగలం. పనిచేస్తే గౌరవంగా ఉంటుంది. పనివల్ల మన నైపుణ్యాలతో ఒకనికొకడు పరిచర్య చేయవచ్చు.

**అన్ని రకాల పనులు దేవుని ఘనపరస్తాయి**

---

## పెద్ద బృందంతో చర్చ

- మన సంస్కృతిలో, కొన్ని పనులు ఇతర పనులకన్నా ప్రాముఖ్యమైనవా? వాటిని ప్రత్యేకంగా చేసేది ఏమిటి?
- దేవుడు ఆదాముకు ఏ ఉద్యోగం/పని ఇచ్చాడు? *(తోటలో పని చేయడం, జంతువులకు పేర్లు పెట్టడం 'ఆది 2:15'20)*
- దేవుడు నోవహుకు ఏ పని ఇచ్చాడు? *(ఓడను కట్టేపని 'ఆది 6:13'14)*
- దేవుడు గిద్యోనుకు ఏ పని ఇచ్చాడు? *(ఇశ్రాయేలీయుల శత్రువుతో యుద్ధాన్ని చేయడం 'న్యాయాధి 6:14)*
- దేవుడు మోషేకు ఏ పని ఇచ్చాడు? *(ఐగుప్తునుండి దేవుని ప్రజలను బయటికి తెచ్చేపని 'నిర్గమ 3:10)*
- తాను చేయమని వారికి ఇచ్చిన పని కాకుండా వారు ఒక సంఘాన్ని నడిపించడం లేక ఒక ప్రసంగం చేయడాన్ని దేవుడు మెచ్చుకునేవాడని మీకు అనిపిస్తుందా?
- దేవుడు వీరిని యాజకులకంటే తక్కువవారుగా లేక తక్కువ ప్రాధాన్యతగలవారుగా భావించివుంటాడని మీకు అనిపిస్తుందా? ఉదాహరణకు, మోషే చేసిన పని అహరోను చేసిన పనికన్నా తక్కువ ప్రాధాన్యతగలదా?

కొన్ని ఉద్యోగాలు/పనులు ఉన్నతమైనవి, కొన్ని తక్కువస్థాయికి చెందినవి అనే ఆలోచన మనకు బైబిల్లో లేదు. ఈ తలంపు సంఘసంస్కరణ కాలంవరకు క్రైస్తవులపై ప్రభావం చూపిన గ్రీకు సంస్కృతిలో ఒక భాగం. దేవుని దృష్టిలో ఆత్మీయ విషయాలు ఉన్నతమైనవి, మరింత ఘనమైనవని, ఇతర విషయాలు తక్కువస్థాయివి లేక దేవుని దృష్టికి ప్రాముఖ్యం కానివి అని గ్రీకులు నమ్మేవారు.

అయితే ఇది బైబిల్ విధానం కాదు. విశ్వాన్ని, భూమి దేవుడు సృష్టించడందో బైబిల్ ఆరంభమౌతుంది. ఆది 2:8లో దేవుడు ఒక తోటను నాటడం మనం చూస్తాం. పొలంలో మనం పనిచేస్తున్నపుడు, దేవుడు మొదటి తోటపనివాడు అని జ్ఞాపకం చేసుకుందాం. అనేక సంవత్సరాల క్రిందట దేవుడు చేసిన పనిని మనం చేస్తున్నాం. విభిన్న మార్గాలలో తనకు సేవచేయడానికి దేవుడు మరలా మరలా ప్రజలను పిలిచాడు. ప్రసంగీకుడు లేక సువార్తికుడుగా పనిచేయడం గౌరవప్రదమైనదే. కాని తోటపని చేయడం, వ్యవసాయం చేయడం, వడ్రంగి పని చేయడం లేదా ఒక ఉపాధ్యాయుడుగా ఉండడం కూడా గౌరవప్రదమే. మనకు ఆత్మీయంగా బోధించేవారే కాక తినడానికి ఆహారం పండిరచేవారు, నివసించడానికి నివాసాన్ని కట్టేవారు, మన పిల్లలకు బోధించేవారు కూడా అవసరమే.

**బ్రదర్ లారెన్స్**

---

## పెద్ద బృందంతో చర్చ

సుమారు 1608లో ఒక వ్యక్తి ఫ్రాన్స్ దేశంలో జన్మించాడు. 18 సంవత్సరాల వయస్సులో అతడు క్రైస్తవుడుగా మారి, 20 సంవత్సరాల వయస్సులో తన జీవితాన్ని దేవునికి పూర్తిగా సమర్పించాలని ఆశించాడు. అతడు ఒక మఠంలో చేరినప్పుడు అతనికి బ్రదర్ లారెన్స్ అనే పేరు పెట్టారు. తాను ఒక మఠంలో చేరాడు గనుక తన సమయం అంతా మందిరంలో ప్రార్థిస్తూ, దేవుని ఆరాధిస్తూ గడపడమేనని అతడు ఊహించాడు. అయితే అతనికి వంటగదిలో పనిచేయడానికి నియమించబడడం గమనించాడు. అందరూ మందిరంలో ఉండగా తాను వంటగదిలో ఉండడాన్ని అతడు 10సంవత్సరాలపాటు ద్వేషించాడు. అలాంటి అర్థంలేని పని తనకు కేటాయించడాన్ని అతడు నిరసించాడు.

## చిన్న బృందంతో చర్చ

***బోధకునికి సూచనలు:*** *చిన్న బృందంతో చర్చలో ప్రశ్నలకై* ***విద్యార్థి సహకారిని*** *ఉపయోగించండి.*

- ఈ పది సంవత్సరాలలో మీరు బ్రదర్ లారెన్స్‌ను కలిస్తే, అతనికి ఎలాంటి సలహా ఇచ్చివుండేవారు?

- మందిరంలో ప్రార్థించే భక్తుని (సన్యాసి) పని ఎంత ముఖ్యమో వంటగదిలో పనిచేసే బ్రదర్ లారెన్స్ పని దానికన్నా తక్కువని మీరు భావిస్తున్నారా?
- ఈ కింది వచనాలు చదివి అవి ఈ పరిస్థితికి ఎంత ప్రాముఖ్యమైనవో ఆలోచించండి:
    - 1కొరింథి 10:31
    - కొలస్సీ 3:23

### నివేదించే సమయం

వంటగదిలో 10 సంవత్సరాలున్న తర్వాత, తాను ఎక్కడవున్నా దేవుని ఆరాధించవచ్చని ఆయన సేవచేయవచ్చని బ్రదర్ లారెన్స్ గ్రహించాడు. **ఏమి మారింది**? తన పని ఎలా చేశాడో, తన పనిపట్ల తన వైఖరినిబట్టే తాను దేవుని ఘనపరచవచ్చు మహిమపరచవచ్చు అని అతనికి ఇప్పుడు తెలిసింది.

బ్రదర్ లారెన్స్ వంటగదిలోనే ఉండిపోయాడు కాని అక్కడ దేవునికి విధేయుడుగా జీవిస్తూ, ఆ గిన్నెలు కడుగుతూ దేవుని సేవచేస్తూ అక్కడే దేవుని సన్నిధిని ఎంతగా అనుభవించాడంటే –తాను మందిరంలో ఉండి దేవుని ఆరాధిస్తే ఎంతో అంతగా అనుభవించాడు.

**మనం ఏమి చేస్తున్నాం** అనేదానికంటే **మనం ఆ పని ఎలా చేస్తున్నాం** అనేదానిపట్ల దేవుడు ఎక్కువ శ్రద్ధకలిగివున్నాడని బైబిల్ మనకు చూపుతుంది. మనం చేసేది పాపపూరితమైనది కానంతవరకు, మనం చేసే ఏ పనైనా దేవునికి మహిమను తెచ్చేదిగా ఉపయోగించవచ్చు.

### భాగస్వామితో చర్చ

- ఏ పని చేసినా దేవుని ఘనపరచవచ్చు అంటే, మీరు చేసే పనిగూర్చి మీరు ఆలోచించే విధానంపై దాని ప్రభావం ఎలా ఉంటుంది?
- అది మీరు చేసే పనిపై ప్రభావం చూపుతుందా?

## మన పనిని మనం ఎలా చేస్తున్నామో దేవుడు లక్ష్యపెడుతున్నాడు

కొన్ని పనులు ఎక్కువ ప్రాముఖ్యమైనవి కొన్ని తక్కువ ప్రాముఖ్యమైనవి అని బైబిల్ ఎన్నడూ సూచించదు. కాని మనం చేసే పనులు/ఉద్యోగాలు ఎలా చేస్తున్నాము అనే విషయమై బైబిల్ చాలా విషయాలు చెబుతుంది. మన జీవితంలో ఇది చాలా ప్రాముఖ్యమైన భాగం `మనం మేలుకుని ఉన్న సమయంలో ఎక్కువ సమయం పనిచేస్తూ గడుపుతాము కాబట్టి మనం మన పనిని ఎలా చేస్తున్నామో జాగ్రత్తగా గమనించవలసి ఉంది.

### చిన్న బృందంతో చర్చ

కింద ఉన్న వచనాలు చూడండి. ఈ వచనాలు పనినిగూర్చి మనకు ఏమి బోధిస్తాయి? ముఖ్యమైన తలంపును ఒక్క వాక్యంలో మీ విద్యార్థి సహకారిపై రాయండి.

- 2థెస్స 3:10–12 – *పని చేయనివాడు భోజనము చేయకూడదు.*
- సామె 10:4 – *బద్ధకముగా పనిచేయువాడు దరిద్రుడగును. శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును.*
- సామె 19:15 – *సోమరితనం గాఢనిద్రలో పడవేసి, పస్తులుండేటట్లు చేస్తుంది.*
- సామె 21:25 – *పనిచేయనివాడు తనను తాను చంపుకుంటాడు.*

ఈ వచనం మన పని ఎలా చేయాలని బోధిస్తుందని మీకు అనిపిస్తుంది?

- కొలస్సీ 3:23 – *ప్రభువుకోసం పనిచేస్తున్నట్లు పనిచేయాలి.*

### నివేదించే సమయం

మనం సోమరులుగా ఉండక పనిచేయాల్సివుంది అని బైబిల్ స్పష్టంగా చెబుతుంది. దేవుడే మన యజమాని (బాస్) అయినట్లు మనం పనిచేయాల్సివుంది.

### పెద్ద బృందంతో చర్చ

తన జీవితంలో ఎక్కువ కాలం యేసు వడ్రంగి పని చేశాడు. ఆయనను ఒక వడ్రంగి పనివాడుగా చూడడానికి ప్రయత్నించండి.

- ఆయన చేసే పని ఎంత నాణ్యమైనదిగా ఉంటుందని మీరు తలస్తున్నారు?
- ఆయనతోపాటు మీరుకూడా పనిచేశారని ఊహించండి: యేసు పనిచేసే చోటనే మీరు కూడా పనిచేయడం ఎలా ఉంటుంది?
- రోజంతా ఆయన ఎలా ప్రవర్తిస్తాడు?
- ఎవరూ చూడనప్పుడు ఆయన ఎలా ప్రవర్తిస్తాడు?

సంఘసంస్కరణ సమయంలో క్రైస్తవులు పనిచేసే విధానంలో అసాధారణమైన మార్పు జరిగింది. మొట్టమొదటిసారి ప్రజలు బైబిల్ చదవడం ఆరంభించి, అది తమ అనుదిన జీవితంలో ఎలా అన్వయించవచ్చో చూచారు. ఆ సమయంలో ఒక వడ్రంగా ఒక బల్లను తయారుచేస్తే, ఆ టేబుల్ అడుగుభాగం కూడా పైనున్న భాగం అంత అందంగా ఉండేటట్లు చూచేవాడు. దేవుడు ఆ బల్ల పైభాగాన్ని ఎలా చూడగలడో, అడుగుభాగాన్ని కూడా అంతే సులువుగా చూడగలడు అని చెబుతూ ఆ వడ్రంగి దేవుని సంతోషపెట్టడానికి పనిచేసేవాడు. ఆ కాలంలో చేయబడిన వస్తువులు అత్యుత్తమమైన నాణ్యతగల వస్తువులుగా నిలిచాయి.

### చిన్న బృందంతో చర్చ

***బోధకునికి సూచనలు:*** *ప్రతి బృందాన్ని ఒక్కొక్క పని ఎంచుకోమనండి (ఉదాహరణకు: బోధకుడు, వ్యవసాయదారుడు, శుభ్రం చేసేవాడు, మొ॥వి). రెండు రకాల పాత్రలు సృష్టించండి: ఒక వ్యక్తి దేవునికి మహిమతెచ్చే విధానంలో పనిచేయడం, రెండవ వాడు దేవునికి మహిమపరచని విధానంలో పనిచేసేటట్లు.*

బృందం అంతటికీ మీ పాత్రలను చూపించండి.

### పెద్ద బృందంతో చర్చ

ప్రతి పాత్రపోషణ తర్వాత ఈ కింది విషయాలు చర్చించండి:

- తాను చేసే పనిలో అతడు/ఆమె దేవునికి మహిమ తెచ్చే విధానాలలో కొన్ని ఏవని మీరు చూచారు?
- తాను చేసే పనిలో అతడు/ఆమె దేవునికి మహిమ తీసుకురాకుండా ఉన్న విధానాలు ఏవని మీరు చూచారు?
- ఈ జాబితాలకు అదనంగా చేర్చగల మరికొన్ని ఆలోచనలు ఏమిటి?

## ముగింపు

### వ్యక్తిగత అన్వయం

మీ పనినిగూర్చి ఆలోచించండి. మీ పనిలో మీరు దేవుని మహిమపరచే కొన్ని విధానాలు ఏవి? దేవుని మీరు మరింతగా ఘనపరచునట్లు మీరు మరింత మెరుగైన రీతిలో పనిచేయుటకు కొన్ని విషయాలను చూపించమని దేవుని అడగండి.

# పాఠం 4: దేవుని రాజ్య సమాజాలు

**ముఖ్యమైన తలంపు**: దేవుని రాజ్యం కేవలం మన జీవితాలను మాత్రమే కాక మన సమాజాలను కూడా ప్రభావితం చేయాలి.

**వస్తువులు**

1. విద్యార్థి సహకారి: భూమిమీద దేవుని రాజ్యం చర్చా ప్రశ్నలు
2. పెద్ద కాగితాలు
3. రంగు పెన్సిళ్ళు లేక మార్కర్స్.

**సమాజ నాయకుడుగా యేసు**

## పెద్ద బృందంతో చర్చ

మీ సమాజానికి నాయకుడుగా యేసును ఊహించుకోగలరా?

- ఆయన ఏమి మార్చివేస్తాడని మీరు భావిస్తున్నారు?
- ఏమి మార్చకుండా ఉంటాడు?

***బోధకునికి సూచనలు:*** *బృందంవారు కేవలం రాజకీయ నాయకులను మార్చడంగూర్చి మాత్రమే దృష్టిపెడితే, యేసు భూమిమీద ఉన్నపుడు రాజకీయ నాయకులను మార్చలేదు అనే విషయం వారికి గుర్తుచేయండి. ఆయన శిష్యులందరూ ఆయన రాజకీయ వ్యవస్థను పడద్రోస్తాడని ఆశించారు కాని ఆయన అలా చేయలేదు.*

బృందంవారు ఆలోచించడానికి కష్టపడుతుంటే, వారి చర్చకు సహాయం చేయడానికి ఈ కింది ప్రశ్నలను మీరు వాడవచ్చు.:

- విధవరాండ్రు, అనాథలనుగూర్చి యేసు ఏమి చేసేవాడు?
- కుటుంబాలను ఆయన ఎలా బలపరచేవాడు?
- పరిశుభ్రమైన త్రాగునీరు, తగిన నివాస, ఆహార, ఆరోగ్య అవసరాలు తీర్చడానికి, చెత్తను, మురుగునీటి వ్యవస్థను సరిగ్గా నడిపించి, మంచి రహదారుల నిర్మాణంగూర్చి ఆయన ఏమి చేసివుండేవాడు?
- పిల్లలు, పెద్ద విద్యనుగూర్చి ఏమి చేయవచ్చును?
- మద్యం, మాదకద్రవ్యాలు (డ్రగ్స్), జూదం, ఇంకా ఇతర వ్యసనాల విషయంలో ఆయన ఏమి చేస్తాడు?
- భర్త/భార్య, పిల్లలపట్ల అనుచితంగా ప్రవర్తించడం విషయంలో ఆయన ఏమి చేసేవాడు?
- ప్రజలమధ్య అనుబంధాలు మెరుగుచేయడానికి ఆయన ఏమి చేస్తాడు?

## భూమిమీద దేవుని రాజ్యం

విశ్వాసులు అన్ని విషయాలలో దేవునికి విధేయత చూపడం ఆరంభించి దేవుని రాజ్యాన్ని నిర్మిస్తే ఎలా ఉంటుందో అనే మాదిరిని మనం బైబిల్లో చూడవచ్చు.

**చిన్న బృందంతో చర్చ**

అపొ.కా. 2:42–47, అపొ.కా. 4:32–35 చదివి, ***విద్యార్థి సహకారి***లో ఉన్న ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి.

- కొత్త విశ్వాసులు ఏమి చేశారు?
  - *అపొస్తలుల బోధను (దేవుని విధానాలకు విధేయులవ్వడానికి) అనుసరించడానికి సమర్పణ చేసుకున్నారు, క్రమంగా కూడుకునేవారు, ఒకరితో ఒకరు పంచుకునేవారు, ప్రార్థించేవారు, దేవుని స్తుతించేవారు, అవసరతలలో ఉన్నవారికి ఇచ్చేవారు, సువార్తను పంచుకునేవారు.*
- ఇవి ఆత్మీయమైన విషయాలా లేక భౌతికమైనవా? *(రెండూ)*
- ఫలితం ఏమిటి?
  - *ఎవరూ అవసరతలో ఉండేవారు కాదు, ఇతరులు వారిని అనుకూలమైన దృష్టితో చూచేవారు, అనేకమంది విశ్వాసులుగా మారారు.*
- ఆది విశ్వాసులవలె మనంకూడ సహవాసంచేస్తే మన సమాజాలలో ఎలాంటి ఫలితాలు చూడగలం?

## నివేదించే సమయం

## పెద్ద బృందంతో చర్చ

మన సమాజాలు ఆది సంఘంవంటివిగా ఉన్నట్లు ఊహించుకోండి` అనేకమంది క్రీస్తువద్దకు వచ్చి, ఆయనకు విధేయులుగా జీవించడం, మనవద్ద ఉన్న ఇతరులతో పంచుకోవడం, మనలో అవసరతలుగలవారు ఎవరూ లేకుండా ఉండడం. ఇదేమీ అసాధ్యమైనది, వాస్తవదూరమైన కల కాదు. అది నాటి ఆది సంఘకాలంలో జరిగింది. కాని ప్రపంచమంతటా ఉన్న సమాజాలలో కూడా ఇలా జరగడం నేడు మనం చూడవచ్చు.

దేవుని రాజ్యాన్ని కట్టడానికి ప్రయత్నిస్తున్న రెండు ప్రాంతాలనుగూర్చి కథలను చదువుదాం.

**కథ 1:** భారతదేశంలో ఒకవ్యక్తి తాను పనిచేస్తున్న గ్రామాన్ని చూడడానికి వెళ్ళాడు. వారి గ్రామానికి యేసు నాయకుడైతే వారి సమాజం/గ్రామం ఎలావుంటుంది అని అతడు ఆగ్రామంలోని స్త్రీలను అడిగాడు. వారిలో నిష్కపటంగా మాట్లాడే శారా అనే ఆమె ఐక్యత, సంఘటితంగా ఉండే ఒక గ్రామాన్నిగూర్చి చెప్పింది. తన గ్రామం విభజించబడినట్లుగా విడిపోయివుండడం యేసుకు ఘనతను ఇవ్వదు అని ఆమెకు తెలుసు. ప్రతి కుటుంబం ఎవరికోసం వారే బ్రతుకుతున్నారు. ఆమె జవాబునుబట్టి గ్రామంలోని కొందరు స్త్రీలు బృందంగా ఏర్పడి ఆరోగ్య కమిటి, స్వయం సహాయక బృందంగా ఏర్పడ్డారు. ఈ స్వయం సహాయక బృందంలోని 14మంది స్త్రీలు గొప్ప ఆసక్తితో క్రమంగా కలుసుకునేవారు. బృందంలోని సభ్యులు వ్యక్తిగతంగా పొదుపు చేసిన సొమ్ములోనుండి చిన్న మొత్తాలను సేకరించి ఒక బృందంగా ఖాతాలో వేశారు. వారు కలసి తమ సమాజంలోని సమస్యలను పరిష్కరించడం ఆరంభించారు. శారా ఆ కమిటీకి అధ్యక్షురాలుగా ఉండి, యేసు నాయకుడుగా ఉంటే ఏమి చేస్తాడో అలాంటి పనులను ప్రణాళిక చేసి, ఆచరించడానికి తన నాయకత్వ వరాలను ఉపయోగించింది.

**కథ 2:** ఉగాండాలో ఒక బైబిల్ అధ్యయనం నుండి వచ్చిన స్త్రీలు, యేసు సేవచేసినట్లు తమ గ్రామంలో పరిచర్య చేయడానికి నిర్ణయించుకున్నారు. వారు స్థానిక మద్యశాల చుట్టూ ఉన్న చెత్తను శుభ్రం చేసే తమ మొదటి కార్యక్రమాన్ని జాగ్రత్తగా ప్రణాళిక చేశారు. వారిలో ఇద్దరు స్త్రీలు ధైర్యంగా ఆ మద్యశాల (బార్)లోకి ప్రవేశించారు. (సాధారణంగా బార్‌లోనికి వెళ్ళే స్త్రీలు వేశ్యలే.) వారు చెత్తను శుభ్రం చేయడానికి అనుమతి కోరారు. ఆశ్చర్యపోయిన యజమానులు నవ్వేశారు కాని అంగీకరించారు. ఆ స్త్రీలు సమాజాన్ని కదిలించారు, అనేకమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఆ బృందం రెండు గోతులు తవ్వారు: ఒకటి బాక్టీరియాతో (బయోడిగ్రేడబుల్) నాశనమయ్యే చెత్త వేయడానికి, మరొకటి మిగిలిన చెత్తకు (నాన్ బయోడిగ్రేడబుల్). తమ చెత్తను ఇతరులు శుభ్రం చేయడం చూచిన బార్ యజమానులు కూడా వారికి సహాయం చేశారు. బార్ యజమానులు ఆ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచడం కొనసాగించడం సమాజానికి సంతోషాన్ని కలిగించింది. దానితో ప్రోత్సహించబడి, స్థానిక కుటుంబాలకోసం తొమ్మిది ఇంధన సామర్థ్యం గల పొయ్యిలు నిర్మించడానికి, అవసరమైనవారికి నీటిని నిల్వ చేసుకునే కుండలను ఇవ్వడానికి ఒక స్త్రీ నిర్ణయించుకుంది. తరువాత ఆ బైబిల్ అధ్యయన బృందం మరింత పెద్ద కార్యక్రమాన్ని చేపట్టింది: సామాజిక సంత. సాధారణంగా గ్రామంలోని స్త్రీలు తమ కూరగాయలను, వస్తువులను దూరంగా ఉన్న సంతలలోకి తీసుకుని అనేక గంటలు నడిచివెళ్ళేవారు. దగ్గరలో ఉన్న సంత వారు తమ కుటుంబాలకు, సమాజానికి, తోటలకు దూరంగా వెళ్ళకుండానే ఆదాయాన్ని సంపాదించే మార్గాన్ని తెరచింది. స్థలం ఇచ్చారు, కాని అది సంత కట్టడం ఆరంభించడానికి చాలా ఎత్తుగా ఉంది. బైబిల్ అధ్యయన బృందంలోని స్త్రీలు ప్రార్థించారు, దగ్గరలో రహదారిని సరిచేస్తున్న పనివారు ఒక బుల్‌డోజర్‌ను తెచ్చి ఎలాంటి రుసుము తీసుకోకుండా ఆ స్థలాన్ని చదును చేసి వెళ్ళారు. దేవుని సహాయంతో గ్రామీణ క్రైస్తవ స్త్రీల చిన్న బృందం వనరులను కనిపెట్టి, వాటిని సమకూర్చి, డబ్బు పొదుపుచేసి, అనుమానాలను పరిష్కరించి ఒక రైతు బజారులాంటి సంతను కట్టారు. యేసు పక్షంగా వారు ఇతరులకు సహాయం చేస్తుండగా వారి ఆత్మీయ జీవితాలు వర్ధిల్లాయి.

- ఈ కథల్లో ఏమి జరిగింది?
- కథల్లోని ప్రజలవల్ల ఆ సమాజాలు వారు ఎలా జీవించాలని యేసు ఉద్దేశించాడో అలా జీవించడానికి దగ్గరయ్యారా? ఎందుకు?
- ఆ బృందాలు చేసిన కొన్ని కార్యక్రమాలు ఏమిటి?
- మీ సమాజంలో మీరు అలాంటివి ఎలా చేయగలరు?

మన సమాజాలను దేవుడు ఉద్దేశించిన వాటిగా మారడం చూడడానికి మనందరమూ పాలిభాగస్తులు కావచ్చు.

## నాలుగు ప్రాంతాల్లోనూ సమాజం మార్పు

ఈ కార్యక్రమంలో దేవుడు ఉద్దేశించినట్లు జీవిస్తూ, ఇతరులు కూడా అలా చేయడానికి సహాయం చేయడంపై మనం దృష్టిపెడతాం. మనం అలా చేస్తుండగా మన సమాజాలలో మార్పును మనం చూస్తాం.

### పెద్ద బృందంతో చర్చ

- యేసు ఎదిగినట్లు మనం ఎదగాల్సిన నాలుగు విధానాలు మీకు జ్ఞాపకం ఉన్నాయా? (లూకా 2:52)
    - *మానసిక, భౌతిక, సమాజిక, ఆత్మీయ*

మన జీవితంలోని ప్రతి విభాగంలో మనం దేవునికి విధేయులమౌతున్నపుడు మన సమాజంలో దేవుని రాజ్యం కట్టబడడాన్ని మనం చూస్తాం. వేర్వేరు విషయాలలో మన సమాజం మార్పు చెందాలి లేక దేవుడు ఉద్దేశించిన విధానంలో మరింతగా ఎదగాలి అని మనం తలంచినపుడు వచ్చే ఒకే ఒక్క విధానం మనం చూడాల్సిన నాలుగు (మానసిక, భౌతిక, సామాజిక, ఆత్మీయ) విషయాలలో మన సమాజం ఎలా వుంది అని.

### చిన్న బృందంతో చర్చ

***బోధకునికి సూచనలు:*** *మానసిక, భౌతిక, సామాజిక, ఆత్మీయ అనే విభాగాలలో వారి సమాజంలో వారు చూడాలనుకునే మార్పులనుగూర్చి ప్రతి బృందాన్ని ఆలోచించమని అడగండి (ఒక చార్టు లేదా కాగితంపై రాయమనండి). సామాజికం అనేది మన అనుబంధాలకు సంబంధించినదని (ఉదాహరణకు వివాహం, పిల్లలను పెంచడం, పొరుగువారితో ఉండాల్సిన సంబంధాలు, సంఘంలో ఐక్యత వంటివి). భౌతికమైనదానిలో డబ్బు, పని, ఆరోగ్యం ఉంటాయి. ఈ పాఠం మొదటిభాగంలో 'సమాజానికి యేసు నాయకుడు అనే మాటనుండి వచ్చిన ఆలోచనలను కూడా వారు చూడవచ్చు.*

### నివేదించే సమయం

### పెద్ద బృందంతో చర్చ

మన కార్యక్రమంలో మనం తరచూ ఈ మార్పులు చూస్తాం. మీరు కూడా అలాంటి విషయాలు జరగాలని ఆశిస్తున్నారా?

1. ఆత్మీయమైనవి

    ఎ. ప్రజలు క్రీస్తువద్దకు రావడం 'సువార్తీకరణ

    బి. పరిపక్వతలో ఎదగడం – శిష్యత్వం

2. భౌతికమైనవి

    ఎ. మెరుగైన గృహాలు

    బి. మెరుగైన బ్రతుకుతెరవు – వ్యవసాయం/రహదారులు, డబ్బును మరింత మెరుగైన రీతిలో నిర్వహించడం

    సి. మెరుగైన ఆరోగ్యం

3. సామాజికమైనవి

    ఎ. సమాజంతో, ప్రభుత్వంతో మెరుగైన సంబంధాలు

    బి. మెరుగైన వైవాహిక జీవితాలు

    సి. పిల్లలను మెరుగైన రీతిలో పెంచడం

4. మానసికమైనవి

    ఎ. పిల్లలకు, పెద్దలకు విద్య

    బి. జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని మెరుగుపరచడం

## పెద్ద బృందంతో చర్చ

మన సమాజాలు మరింతగా తన రాజ్యంవలె రూపాంతరం పొందడం చూడాలని దేవుడు కూడా ఎదురుచూస్తున్నాడు. 'పరలోకంలో జరుగుచున్నట్లు భూమిమీద కూడా ఆయన చిత్తం' జరిగి ఆయన రాజ్యం వచ్చేలా ప్రార్థించి, 'తన రాజ్యమును మొదటిగా వెదకమని' యేసు మనలను ప్రోత్సహించాడు.

- పైన చెప్పుకున్న నాలుగు విభాగాలలో దేవునికి సంపూర్ణ విధేయతతో ప్రతి ఒక్కరూ జీవించే సమాజంలో జీవించడం ఎలా ఉంటుందో మీరు ఊహించగలరా? సంతోషించే కుటుంబాలు, స్నేహపూర్వకమైన ఇరుగుపొరుగువారు, ఒకరికొకరు సహాయం చేసుకుని సౌభాతృత్వంతో జీవించడం. ఇక పై వాదనలు లేక గొడవలు లేక యథార్థల లేని పరిస్థితిలో జీవించడం.
- అలాంటి సమాజంలో జీవించడం మీకు ఇష్టమేనా? ఎందుకని?

దేవుడు మనకు ఒక ఉత్తేజకరమైన దర్శనం ఇచ్చాడు: అది `ఆయన రాజ్యం భూమిమీదికి వచ్చే దర్శనం. భూమిమీద ఆయన రాజ్యాన్ని కట్టే పనిలో మనం కూడా భాగం కావాలని ఆయన కోరుతున్నాడు. ప్రతిఒక్కరూ దేవునికి విధేయులైతే ఉండే ప్రపంచం ఎలావుంటుందో ఊహించండి. అది పరలోకంలా ఉంటుంది! యేసు తిరిగి వచ్చేవరకు ఇది నెరవేరదని మనకు తెలిసినప్పటికీ, దేవుడిచ్చిన ఈ దర్శనంపై పని చేయడం మనం ఆరంభించవచ్చు.

ప్రతిరోజు మనం మేల్కొనగానే ఈ విషయాలను తలపోయవచ్చు:

1. ఈరోజు నేను దేవుని రాజ్యాన్ని ఎలా కట్టగలను?
2. దేవుని రాజ్యాన్ని విస్తరించడానికి నేను ఏమి చేయగలను?
3. దేవుని నియమాల ప్రకారం నేను ఎలా జీవించవచ్చు?
4. అదే పని చేయడానికి నా కుటుంబానికి /సమాజానికి నేను ఎలా సహాయపడగలను?

## చిన్న బృందంతో కార్యక్రమం

- దేవుని రాజ్యాన్ని మీ సమాజంలోనికి తీసుకురావడానికి సహాయం చేయడానికై మీరేమి చేయగలరో రెండు విషయాలను ఆలోచించండి.

మీ సమాజంలోనికి ఆయన రాజ్యాన్ని తీసుకురావడానికి ఆయన సహాయంకోసమై కలసి దేవుని ప్రార్థించండి.

# పాఠం 5: ఇతరులకు సేవచేయడంద్వారా దేవుని రాజ్యాన్ని నిర్మించడం

**ముఖ్యమైన తలంపు**: మనం ఇతరులకు సేవచేస్తుండగా మన సమాజాలు మరింతగా దేవుని రాజ్యంవలె మారడం మనం చూస్తాం.

**వస్తువులు:**

1. విధ్యార్థి సహకారి: శ్రీమతి లీ కథలు, అవసరతవున్న కుటుంబం చర్చా ప్రశ్నలు.
2. విధ్యార్థి సహకారి: ఒక క్రైస్తవ కుటుంబం మార్పును తెస్తుంది `కథ, ప్రశ్నలు.

## మీతో, మీ కుటుంబంతో ఆరంభించండి

### పెద్ద బృందంతో చర్చ

దేవుని రాజ్యాన్ని కట్టడం ఒక సాధారణమైన మాదిరిని అనుసరిస్తుంది:

***బోధకునికి సూచనలు**: ఈ మాదిరిని ఒక బోర్డుపై లేక ఒక చార్టుపై గీయండి.*

**మీరు  →  మీ కుటుంబం  →  మీ సమాజ  →  మీ దేశం**

### 1. మీతో ఆరంభించండి

మీ జీవితంలో, మీ కుటుంబంలో, మీ సంఘంలో, మీ సమాజంలో, మీ దేశంలో దేవుని రాజ్యం కట్టబడడం చూడడానికి మొదటి అడుగు మిమ్మల్నిమీరు పరీక్షించుకోవడం. మీ జీవితంలోని ప్రతి విభాగంలో మీరు దేవునికి విధేయులుగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారా?

### 2. మీ కుటుంబానికి బోధించి, వారిని ప్రోత్సహించడం

మీ జీవితంలోని ప్రతి విభాగంలో మీరు దేవునికి విధేయులవుతుండగా, అదేవిధంగా చేయమని మీ కుటుంబాన్ని ప్రోత్సహించాల్సిన అవసరత ఉంది.

### 3. ఇతరులను ప్రేమించడానికి మిమ్ములను వాడుకోమని దేవుని అడగండి

ఇతరులపై ప్రభావం చూపించడానికి సహాయం చేయమని దేవుని అడగడం ఆరంభించండి. అవకాశాలకోసం చూడండి. అవసరతలో ఉన్నవారిని మీరు చూచినప్పుడు, అలాంటి వారికి మీరు ఎలా సహాయపడగలరో చూపమని దేవుని అడగండి.

### 4. ఇతరులకు సేవచేయడం

ప్రేమచూపే కార్యాలలో పాల్గొని సేవచేసే ఇతర మార్గాలను వెదకండి. మీరు ఎక్కువగా చేయలేకపోతున్నట్లుగా భావించినా, సేవచేయడానికి దేవుడు మీకిచ్చిన తలాంతులన్నీ మీరు వాడాలి. మీరు సేవచేస్తుండగా, మీరు వర్ధిల్లడం ఆరంభించి, మీరు మరింత చేయగలరనే విషయాన్ని కనుగొంటారు.

## ఇతరులకు సేవచేయడాన్ని నేర్చుకోవడం

ఈ పాఠంలో మన సమాజంలో ఉన్నవారికి మనం ఎలా సేవచేయగలమో చూడబోతున్నాం. చాలా డబ్బు ఖర్చు పెట్టకుండానే లేక మనమీద ఆధారపడేటట్లు చేయకుండానే ఎలా సేవ చేయగలమో చూద్దాం.

### చిన్న బృందంతో చర్చ

మీ సమాజంలో ఒక అవసరతగల కుటుంబం ఉన్నదని ఊహించండి. ఆ కుటుంబానికి సహాయం చేయడానికి మీరు చేయగల కొన్ని పనులు ఏమిటి?

### నివేదించే సమయం

శ్రీమతి లీ అనే స్త్రీ ఆసియాలో ఉన్న ఒక నిజమైన వ్యక్తి, కాని ఆమె పేరును మేము ఇక్కడ మార్చివ్రాస్తున్నాం. తన సమాజంలో, ముఖ్యంగా పని లేకుండా ఉన్న పేద కుటుంబాలకు సహాయం చేయాలని పరితపించేది. అలాంటి కుటుంబాలు జీవనోపాధి సంపాదించుకోవడానికి మార్గాలు వెదకుతూ కొందరి కుటుంబాలను ప్రతి నెలా ఆవిడ సందర్శించడం ఆరంభించింది. ఆమె సహాయం చేయగలిగిన అనేక కుటుంబాలలో జరిగిన మూడు కథలను ఇక్కడ ఇస్తున్నాం. ఈ కథలన్నీ వాస్తవంగా జరిగినవి.

### చిన్న బృందంతో చర్చ

మీ బృందాలలో *విద్యార్థి సహకారి*లోని శ్రీమతి లీ కథలను చదివి, ప్రశ్నలకు జవాబివ్వండి.

**కథ 1 ` శ్రీమతి లీ ` పూలతోటలు**

తానున్న ప్రాంతంలో ఇద్దరు పిల్లలతో ఉన్న ఒక పేదకుటుంబం ఉంది. తలిదండ్రులిద్దరూ నిరుద్యోగులు. శ్రీమతి లీ వారిని దర్శించడానికి ఆగినపుడు, వారి ఇంటి ముందు చిన్న స్థలం ఉండడం గమనించింది. 'ఇక్కడ మీరు కొన్ని పూలమొక్కలు నాటవచ్చు కదా?' అని అడిగింది. 'అవి మీ ఇంటిని అందంగా చేస్తాయి, అంతేకాదు వాటిని దగ్గరలోని మార్కెట్‌లో అమ్మవచ్చు కూడా' అని చెప్పింది.

ఈ కుటుంబంలోని తల్లి అలాగే చేసి, తను పెంచిన పువ్వులు మార్కెట్‌కు తీసుకెళ్ళి అమ్మడం ఆరంభించింది. కొనేవారు ఇంకా వేరే రకాల పువ్వులకోసం అడగడం మొదలుపెట్టడం ఆమె గమనించింది. కాని తమ చిన్న స్థలంలో వేరే రకం పూలమొక్కలు నాటే అవకాశం లేదు. ఈ తల్లి నెమ్మదిగా వేరేవారి దగ్గర్నుండి పువ్వులు కొని, తన పువ్వులతోపాటు లాభానికి అమ్మడం మొదలుపెట్టింది. తన పువ్వులు అమ్మడానికి మార్కెట్‌లో తనకు చిన్న చోటు ఉన్నందున, 'నేను ఇతర వస్తువులు కూడా అమ్మవచ్చు కదా' అని ఆలోచించింది. ఆమె ప్రతిరోజు పొద్దున్నే లేచి అరటిపండ్లు, కొబ్బరికాయలు కొని మార్కెట్‌లో తనకు కేటాయించిన స్థలంలో అమ్ముతుంది.

**కథ 2 ` శ్రీమతి లీ ` చిలకడ దుంపలు**

సహాయం అవసరమైన మరొక కుటుంబం పనిచేయడానికి సిద్ధంగా ఉంది కాని ఏమి చేయాలో తెలియదు, వారికి ఎలాంటి ప్రత్యేక నైపుణ్యాలు లేవు. రోజు కూలీలుగా పనిచేశారు కాని తరచుగా వారికి పని దొరికేది కాదు. ఈ కుటుంబం కష్టపడి పనిచేసేవారని, నిజంగా పనిచేయాలనుకుంటున్నారని శ్రీమతి లీ చూచింది. కాబట్టి సంఘంలో ఉన్న చిలకడ దుంపలు పండిరచే మరొక కుటుంబాన్ని కలిసింది. చిలకడదుంపల వ్యవసాయం లాభకరంగా ఉందా అని వాకబు చేసింది. దానికి మంచి మార్కెట్ ఉంటే ఆ వ్యవసాయం చేయడానికి ఏమేమి అవసరమౌతాయో అడిగింది.

అది మంచి పని అని తెలుసుకున్న తర్వాత, మన పొరుగువారిని ప్రేమించడానికి, పేదలను పరామర్శించడానికి దేవుడు మనలను పిలిచాడని ఆ కుటుంబానికి వివరించింది. చిలకడ దుంపలు ఎలా సాగు చేయాలో ఆ పేద కుటుంబానికి నేర్పించడానికి వారికి ఇష్టమో కాదో ఆమె కనుక్కొంది. వారు అంగీకరించారు. శ్రీమతి లీ ఇరు కుటుంబాలను ఒకరికొకరిని పరిచయం చేసింది. ఈ పేద కుటుంబం ఏదొక పనిచేసే అవకాశం వచ్చినందుకు ఉత్సాహంగా ముందుకువచ్చి, ఒక చిన్న స్థలాన్ని అద్దెకు తీసుకుని ఆ సాగు ఆరంభించడానికి అవసరమైనవి సమకూర్చుకుంది. సంవత్సరం ముగిసేసరికి, వారికి మంచి దిగుబడి వచ్చి, ఆ స్థలానికి అద్దె, విత్తనాలు కొనడానికి అయ్యే ఖర్చుపోగా, మంచి లాభం పొందింది.

**కథ 3 ` శ్రీమతి లీ ` కుటుంబాలమధ్య సమాధానం**

శ్రీమతి లీ సహాయం చేయాలనుకున్న మూడవ కుటుంబం, వారి తలిదండ్రులనుండి విడిపోయినవారు. తమ కుమారుడు అతని కుటుంబం ఎందుకూ పనికిరానివారని, ఎలాంటి విలువ లేనివారని తలిదండ్రులు భావించారు. శ్రీమతి లీ ఆ కుటుంబాలను కలిసి ఇరుపక్షాల సమాధానపరచడానికి ప్రయత్నించింది. తలిదండ్రులు వారి కుమారుని కుటుంబాన్ని తిరిగి స్వీకరించడానికి ఇష్టపడి, వారికి కొంచెం సహాయం చేస్తానంటే, తాను క్రమంగా వారి కుటుంబాన్ని కలిసి వారి జీవితాలు మెరుగుపడడానికి సహాయం చేస్తానని ఆమె మాట ఇచ్చింది. దాని ఫలితంగా ఆ తలిదండ్రులు తమ కుమారుని మరలా నమ్మడానికి నిర్ణయించుకొని, తుక్కు ఇనుము వ్యాపారం చేయడానికి అతనికి కొంత సొమ్మును అప్పుగా ఇవ్వడానికి సమ్మతించారు. ఆ కుమారుడు ఇప్పుడు పాత, వాడిన ఇనుపసామాన్లు కొని అమ్మడం ఆరంభించాడు. ఇప్పుడు అతడు తన కుటుంబానికి సహకారంగా ఉండి గౌరవంగా బ్రతుకుతున్నాడు.

1. ఈ కుటుంబాలలో ప్రతి ఒక్కరికీ శ్రీమతి లీ ఏమి చేసింది?
   - *సలహా ఇచ్చి, ప్రోత్సాహపరచింది*
   - *ఇతరులను కలసింది `చిలకడ దుంపలు అమ్మే కుటుంబాన్ని కలిసి అది లాభదాయకంగా ఉందా అని తెలుసుకొని, వారు వేరొకరికి సహాయం చేయడానికి ఇష్టపడుతున్నారా అని తెలుసుకుంది.*
2. శ్రీమతి లీ చేసిన పనుల ఫలితం ఏమిటి?
   - *వారికి పనులు దొరికాయి, వారు తమ కుటుంబాలను పోషించుకోగలిగారు.*
   - *ఇతరులకు సహాయం చేయగలిగామనే తృప్తి కొందరికి కలిగింది.*
3. పైన చెప్పిన కథలలోని వారికి శ్రీమతి లీ కొంచెం డబ్బో లేక ఆహారమో ఇచ్చివుంటే ఏమి జరిగివుండేది?
   - *వారు మారేవారు కాదు.*
4. ఒకవేళ శ్రీమతి లీ వారికి రెండు సంవత్సరాలపాటు ప్రతివారం కొంత డబ్బు ఇచ్చివుంటే, వారి జీవితాలు ఏమాత్రమైనా మెరుగుపడివుండేవంటారా?
   - *లేదు, శ్రీమతి లీనుండి డబ్బులు తీసుకోవడం అలవాటైపోయి, పనిచేయడంకన్నా ఆమెమీదే ఆధారపడిపోయేవారు.*

5. డబ్బులిచ్చి సహాయం చేయడానికి, శ్రీమతి లీ చేసినట్లు సహాయం చేయడానికి మధ్య ఉన్న తేడా ఏమిటి?
    - *ఆమె వారికి నైపుణ్యాలను, తమకు తాము సహాయం చేసే ఆచరణాత్మక మార్గాలను ఇచ్చింది.*
6. మనలో అనేకులు కుటుంబాలను దర్శించి, వారి బాధలు విని, వారి సమస్యలను చూచి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి, తరువాత పరిష్కారాలకోసం చూసే శ్రీమతి లీ వలె ప్రవర్తిస్తే ఎలా ఉంటుందో ఊహించండి. అది మీ సమాజంపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది?

## నివేదించే సమయం

## అవసరతలో ఆదుకునే స్నేహితుడు

---

### పెద్ద బృందంతో చర్చ

మీ సంఘానికి దగ్గరలో నివసించే ఒక కుటుంబాన్ని ఊహించుకోండి. భర్త సాధారణంగా బయటికి వెళ్ళిపోయి నెలకు ఒకసారి లేక రెండుసార్లు కొంచెం డబ్బుతో ఇంటికి వచ్చి, కొన్నిరోజులుంటున్నాడు అనుకుందాం. భార్య తమ ముగ్గురు పిల్లల్ని చూచుకుంటుంది. వాళ్ళింకా స్కూలుకు వెళ్ళడం లేదు. సాధారణంగా పిల్లలు చెప్పులేకుండా, చిరిగిపోయిన పాత బట్టలు వేసుకుని ఆడుకుంటున్నారు. వారున్న ఇల్లు బాగా పాడైపోయి, వర్షానికి లోపలంతా కారిపోతుంది. కొన్నిసార్లు ఆకలితో ఆ పిల్లలు ఏడ్వడం కూడా వినిపిస్తుంది.

- ఈ కుటుంబానికి ఉన్న కొన్ని అవసరాలు ఏవి?

అన్నిటికంటే ఎక్కువగా, ఆ స్త్రీ చాలా నిరుత్సాహంతో ఉండివుండొచ్చు. పని లేకుండా ఉన్నవాళ్ళు ఎక్కువసార్లు మనం అనుకున్నట్లు సోమరితనంతో ఉండాలనేమీ లేదు. తరచుగా వారు తమ జీవితంలోని కష్టాలలో మునిగిపోయినందున, తామేమైనా మార్చగలమా అనే నమ్మకాన్ని కూడా కోల్పోతారు. మారడం ఆరంభిస్తే, పరిస్థితి మార్చగలరు అని వారు చూచేటట్లు వారికి సహాయం చేయడం మీరు చేయాల్సిన ముఖ్యమైన పని. ఆ కుటుంబానికి కొంచెం బియ్యం ఇవ్వడం ఫర్వాలేదు కాని ఒకసారికంటే ఎక్కువసార్లు అలా చేస్తే, వారు దేనికీ పనికిరారు అని వారు నమ్మడానికి మీరు సహాయం చేస్తున్నట్లు అనిపిస్తుంది. జీవితం మారగలదు అనే నిరీక్షణ/ఆశ వారికి అవసరం.

### చిన్న గుంపుతో చర్చ

***బోధకునికి సలహాలు:*** ***విద్యార్థి సహకారి*** *వాడండి: అవసరతలో ఉన్న ఒక కుటుంబం 'చర్చ, ప్రశ్నలు.*

- ఈ కుటుంబాన్ని శ్రీమతి లీ చూచినట్లు చూచి, మీరు చేయగలిగే సహాయం ఎలా చేయగలరు?

అవకాశం ఉన్న జవాబులు:

- *భార్యకు, చిన్న పిల్లలకు కొంచెం డబ్బు సంపాదించడానికి సహాయం చేయడం. వారికి ఏమైనా స్థలం గాని, ప్రత్యేకమైన నైపుణ్యాలు గాని ఉన్నాయా?*
- *చిన్న పిల్లలు స్కూలుకు వెళ్ళడానికి సహాయం చేయడం. ఆ తల్లిని మీతో తీసుకువెళ్ళి, స్థానిక ప్రభుత్వ ఆఫీసులో వారితో మాట్లాడి, పిల్లలు స్కూలుకు వెళ్ళడానికి బస్సుకు పాస్‌లు లేకపోతే మీ ప్రాంతంలో ఏదైనా విద్యా కార్యక్రమం జరుగుతుంటే దానికి పంపే అవకాశం చూడాలి. ఎలాంటి సహాయం అందుబాటులో ఉందో కనుక్కోండి.*
- *సంఘంలోనివారి వద్ద వాడిన పాత దుస్తులు సమకూర్చి, పిల్లలకు కనీసం కొన్ని దుస్తులు ఇవ్వడానికి ప్రయత్నించడం.*
- *ఆ తల్లిని తరచూ కలిసి, జీవితం మారుతుంది అని ఆమెను ప్రోత్సహించడానికి సమయం తీసుకోవడం.*
- *వారి ఇంటిని బాగుచేయడానికి ఆ కుటుంబానికి సహాయం చేయడం. సంఘంలో కొద్దిమందిని ఆ పని చేయడానికి అడగండి. కాని దానికోసం ఆ కుటుంబంలో ఉన్న వస్తువులనే వాడి, పిల్లలు కూడా పనిలో పాల్గొనేటట్లు చేయాలి. 8సంవత్సరాల పిల్లలకు చాలా శక్తి ఉంటుంది!*
- *కూరగాయలు పండిరచే చిన్న తోట ఆరంభించడానికి కుటుంబాన్ని ప్రోత్సహించడం. తద్వారా వారికి మంచి ఆహారం ఉంటుంది.*
- *ఆ కుటుంబానికి కొన్ని కోడిపిల్లల్ని ఇచ్చి, సంఘంలో ఎవరైనా కోళ్లను ఎలా పెంచాలో వారికి నేర్పించడానికి సహాయం చేయడం. ఆ కోళ్ళు పెద్దవైనపుడు వాటిని వండుకుని తినే శోధననుండి తప్పించడానికి అవకాశం లేకుండా వాటిని మీ*

*ఇంటిదగ్గర ఉంచుకొని, వాటిని చూచుకోవడానికి, గ్రుడ్లు తీసుకువెళ్ళడానికి పిల్లల్లో ఒకరిని రోజూ రమ్మనవచ్చు. కోళ్ళను బాగా ఎలా చూచుకోవాలో వారికి బాగా వచ్చేటట్లు చూడడం.*

- *ఆ భర్త/భార్య కుటుంబ సభ్యులను సంప్రదించడం 'వారేమైనా సహాయం చేయగలరేమో!*
- *భర్త సంపాదించే డబ్బును మరింత మెరుగైన రీతిలో వాడుకోవడానికి ఒక ఆలోచన చెప్పి సహాయం చేయడం. భవిష్యత్తులో మంచి ఆదాయం వచ్చేలా వారు కొంత సొమ్మును ఎక్కడైనా పెట్టుబడి పెట్టే అవకాశం ఉందా? ఎల్లప్పుడూ వారివద్ద ధనం ఉండేటట్లు ఎలా చేయగలరు?*

**సమాజాలు**

---

## చిన్న లేక పెద్ద బృందంతో చర్చ

***బోధకునికి సూచనలు:*** *విద్యార్థులు ఉన్న బృ:ందానికి* **విధ్యార్థి సహకారి** *వాడండి. బృందాలుగా కథను చదివి అందులోని ప్రశ్నలను చర్చించమని విద్యార్థులకు చెప్పండి. చదువు రానివారికోసం కథను చదివి చర్చించండి.*

ఒక వ్యక్తి తన కుటుంబంతోపాటు క్రీస్తుకు సాక్షిగా ఉండాలని, క్రైస్తవులు లేని ప్రాంతానికి తన కుటుంబంతో కలసి వెళ్ళిన నిజమైన కథ ఇది. దేవుని రాజ్యం కట్టబడాలని, ప్రజల జీవితాలు మానసికమైన, భౌతికమైన, ఆత్మీయమైన, సామాజికమైన ప్రతి విభాగంలో మార్పు చెందడం చూడాలని అతడు ఆశించాడు.

## ఒక్క క్రైస్తవ కుటుంబం – గొప్ప మార్పును తెస్తుంది!

ఒక క్రైస్తవేతర గ్రామంలో ఒక్క క్రైస్తవ కుటుంబం దేవుని రాజ్యం కట్టడానికి సహాయపడిన కథ ఇది. ఆ గ్రామం హిమాలయ పర్వతశ్రేణుల్లో ఉంది. ఆ గ్రామానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఒక తేయాకు (టీ) తోట ఉంది. ఇదే ఆ గ్రామంలోని ప్రజలకు ముఖ్యమైన పనిగా ఉండేది. అయితే కూలి చాలా తక్కువగా ఉండడంతో ఉద్యోగాలు ఉన్నప్పటికీ ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామంలో సుమారు 24 ఇళ్ళు ఉండేవి. అవన్నీ శిధిలం కావడానికి సిద్ధంగా ఉన్నట్లుగా, సరిగ్గా కట్టబడని రేకుతో కప్పిన చెక్క ఇళ్లు. గ్రామంలో లెట్రిన్‌లు కూడా లేవు. అది ఎంతో ఎత్తైన పర్వతం మీద ఉండడంవల్ల చాలా చలిగా ఉండేది. పిల్లల కాళ్ళకు చెప్పులుండేవి కావు, వారి పొట్టలు ఉబ్బిపోయివుండేవి.

ప్రతి ఇల్లు ఒక చిన్న స్థలంలో ఉండేది. వంట చేసుకోవడానికి మూడు రాళ్ళమీద కుండను పెట్టి, కట్టెలతో వండుకునేవారు. ఆ ఇళ్ళ పరిసరాలు మురికిగా ఉండి కొన్ని కోళ్ళు ఇళ్ళలోకి బయటికి పరుగుపెడుతూ ఉండేవి.
దగ్గరలోని స్కూలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండేది. పిల్లలు అంతదూరం రోజూ నడిచివెళ్ళలేకపోయేవారు, వారికి ఇంటిచుట్టూ పనులు చేయాల్సి వచ్చేది కూడా. కాబట్టి చాలమంది పిల్లలు స్కూలుకు వెళ్ళేవారు కాదు. పెద్దలలో అనేకులకు చదవను రాయను రాదు. కాబట్టి ఇతర గ్రామాల్లో ఉండేవారు వారిని త్వరగా మోసం చేయగలిగేవారు.

చాల తక్కువ తోటలు ఉండేవి ఎందుకంటే దగ్గరలోని నీటికోసం రెండు కిలోమీటర్ల దూరంలోని రిజర్వాయరుకు వెళ్ళాలి. త్రాగడానికి, బట్టలు ఉతుక్కోవడానికే నీళ్ళు తీసుకురావడం కష్టమయ్యేది, ఇక తోటలకు నీళ్ళు ఎలా తీసుకురాగలరు? ఒకప్పుడు రిజర్వాయరునుండి పైపులద్వారా నీళ్ళు వచ్చేవి. కాని అవి పనిచేయడం లేదు, ప్రజలు వాటిని బాగుచేయించుకోవడానికి ప్రయత్నించలేదు. వర్షాలు కూడా చెదురుమదురు జల్లుల్లా పడేవి. కేవలం ఒక్క కాలంలోనే వారి ముఖ్యమైన పంట (బియ్యం) పండిరచడానికి ఆ నీళ్ళు సరిపోతుండేవి. కూరగాయలు పండిరచడానికి తగిన స్థలం గాని సమయం గాని ఉండేవి కావు. వారి అదృష్టం బాగుంటే మరలా పంట వచ్చేంతవరకు తగినంత బియ్యం పండిరచుకునేవారు.

ప్రజలు హిందువులు కాబట్టి అనేకమంది వేర్వేరు దేవతలను పూజించేవారు. హిందువులు పూజించి, సంతోషపెట్టాల్సిన దేవతలు సుమారు 10లక్షలమంది ఉండేవారు. గ్రామంలో అనేక చిన్నచిన్న విగ్రహాలు ఉండేవి. గ్రామస్తులు భోజనం చేసిన ప్రతిసారి అక్కడ తిరిగే ఆత్మలకోసం కొంత ఆహారం నేలపై పడవేసేవారు.
గ్రామంలో ఒకలాంటి ఓటమి, నిరాశ అలుముకుని ఉండేవి. వారికున్న ఒకేఒక్క ఆశ తరువాత జన్మలో వారు మెరుగైన పరిస్థితిలో పునర్జన్మ పొందుతామనేదే. కాని వాళ్ళు ఒకవేళ తమ దేవుతలకు బాధకలిగిస్తే, తరువాత జన్మలో ఎలకగానో కుక్కగానో పుట్టే అవకాశం కూడా ఉంది. బయటికి రాలేని పరిస్థితిలో, తమను తాము బాగుచేసుకోలేని దుస్థితిలో వారు చిక్కుకుపోయినట్లు భావించేవారు.

లెప్చా ఈ ప్రాంతానికి వచ్చిన ఒక సువార్తికుడు. అతడు ఇతరులకు వారి ఆరోగ్యం మెరుగుపరచుకునే సహాయం చేయడానికి సంబంధించిన ప్రాథమిక విషయాలను ఒక్కనెల కోర్సులో నేర్చుకున్నాడు. తన కోర్సు పూర్తిచేసిన తర్వాత ఈ గ్రామానికి తన కుటుంబంతో తాము నేర్చుకున్నదాన్ని పొరుగువారితో పంచుకొని వారికి సహాయం చేయడానికి అక్కడ నివసించేందుకు వచ్చారు. వారి ఇంటి పరిసరాలు చాలా శుభ్రంగా ఉండేవి. వంటచేయడానికి తక్కువ కట్టెలతో సులువుగా వంటచేసుకునేలా ఒక వంటగది కూడా ఉండేది. కోళ్ళను ఉంచడానికి చిన్న గూడులాంటిది చేసుకున్నారు. వాళ్ళు చిన్న కూరగాయల తోట వేసుకుని పిల్లలకు చక్కని పోషకాహారాన్ని ఇచ్చేవారు. ఇంటి బయట ఒక మరుగుదొడ్డి కట్టుకున్నారు. గ్రామంలోని పిల్లలకు వచ్చినంత తరచుగా వీరి పిల్లలకు విరోచనాలు లేక నులిపురుగుల సమస్య వచ్చేది కాదు.

తన ఇంటి మీద ఉన్న రేకులకు దొనెలాగా చేసి, చెదురుమదురుగా పడే జల్లులనుండి నీటిని ఒడిసిపట్టి కింద ఏర్పాటుచేసిన డబ్బాలలో కూర్చుకునేవాడు. ఈ ఆలోచనను ఇతరులు కూడా చూచి అనుసరించారు. అందువల్ల వర్షాలు పడినప్పుడు వారికి కూడా నీళ్ళు ఉండేవి. తరువాత గ్రామంలోని ప్రజలను సమాజంగా చేర్చి, రిజర్వాయరు నుండి గ్రామానికి పైపులైను వేయించాడు లెప్చా. ఇప్పుడు గ్రామస్తులందరికీ వాళ్ళ కొత్త కూరగాయల తోటలను తడపడానికి సహా నీళ్ళు సమృద్ధిగా వచ్చేవి. చాలామంది కోళ్ళగూడును కూడా తయారు చేసుకుని, వాసన రాని లేక ఈగలు వాలని మరుగుదొడ్డినికూడా నిర్మించుకున్నారు.

లెప్చా కుటుంబం వచ్చినపుడు అక్కడ చదవను రాయను నేర్చుకోవాలనుకునే పిల్లలకు, పెద్దలకు బోధించడం ఆరంభించారు. పిల్లలకు, యవ్వనులకు చదవడం నేర్పించారు. ఈరోజు గ్రామంలోని పిల్లలకు 4వతరగతి వరకు స్కూలు గ్రామంలోనే ఉంది.
ఈ రోజు ఆ గ్రామంలో ఒక చిన్న సంఘం ఉంది. ఎందుకంటే ఆ గ్రామంలోని 25 కుటుంబాలలో 23 కుటుంబాలవారికి క్రీస్తుతో వ్యక్తిగత అనుబంధం ఉంది. దీని అంతటికీ కారణం ఈ ఒక్క కుటుంబం తమ మాటలతో, చేతలతో వారికి క్రీస్తునుగూర్చి చెప్పినందుకే. ప్రజలకు సంతృప్తికరమైన భావన ఉంది. ఒక కుటుంబం తమనుగూర్చి శ్రద్ధవహించి, తమ జీవితాన్ని వారితో పంచుకోవడానికి వచ్చినందుకు వారు ఆరోగ్యకరమైన జీవితాలు జీవించగలుగుతున్నారని వారు చూడగలిగారు.

ఇదే కథ అనేక సమయాల్లో ఉత్తర భారతదేశం, తూర్పు నేపాల్ ప్రాంతంలోని గ్రామాలలో మరలా మరలా చెప్పబడుతుంది. ఆ ప్రాంతంలోని 120 గ్రామాల్లో ఈ రోజు ఇవే కార్యక్రమాలు జరుగుతూ ఉన్నాయి. భౌతికంగా ప్రజల జీవితాలు మారాయి. కాని 107 గృహ సహవాసాలు ఆరంభించబడి ఆ గ్రామాలు ఆత్మీయంగా కూడా మార్పు చెందాయి. వాటిలో 200మంది సభ్యులుగల సహవాసాలు 12 ఉన్నాయి.

- సమాజంలో లెప్చా తెచ్చిన కొన్ని మార్పులు ఏమిటి? మరలా కథను చదివి, మానసిక, భౌతిక, ఆత్మీయ, సామాజిక అనే శీర్షికల క్రింద ఆ మార్పుల జాబితాను రాయండి.
- అతడు ఈ మార్పులు ఎలా చేశాడు? ఎవరితో ఆరంభించాడు?
- లెప్చావల్ల సమాజం ఎలా మారిపోయింది?
- మీ సమాజంలో మీరు లెప్చావలె ఎలా ఉండగలరు?

**గమనిక**: మరొక తర్ఫీదులో, లెప్చా నేర్చుకున్నట్లుగానే ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను ఒక క్రమంలో మీరు కూడా నేర్చుకుంటారు.

## ముగింపు

ఇతరులకు ఎలా సహాయం చేయాలి అనడానికి లెప్చా, శ్రీమతి లీ ఇద్దరూ రెండు మాదిరులు మాత్రమే. ఇది మనకు ఏమి జ్ఞాపకం చేస్తుందంటే 'వస్తువులు ఇవ్వడంద్వారా మనం ఇతరులకు సహాయం చేయము గాని ప్రజలతో సమయం గడపడం, వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం, అనుబంధాలు కట్టడం, ప్రోత్సహించడం, బోధించడం, మార్పుకు మాదిరులుగా ఉంటాము అని.

## చిన్న బృందంతో చర్చ

- మీ సమాజాన్నిగూర్చి ఆలోచించండి. మీరు పరిచర్య చేయగల కుటుంబం ఏదైనా ఉందా? వారికి సేవచేయగల కొన్ని మార్గాలు ఏవి?
- మీరు ఆచరించగల కొన్ని మంచి అభ్యాసాలు ఉన్నాయా? మీరు ఏమి చేయగలరు?

**నివేదించే సమయం**

# పాఠం 6: దేవుని జ్ఞానం, దేవుని శక్తి

**ముఖ్యమైన తలంపు**: మన సమాజం మారడం మన చూడాలనుకుంటే మనకు దేవుని జ్ఞానం, శక్తి అవసరం. దేవుడు మాత్రమే ఒక సమాజాన్ని మార్చగలడు.

**వస్తువులు**

- విధ్యార్థి సహకారి: దేవుని జ్ఞానం
- విధ్యార్థి సహకారి: దేవుడు అభివృద్ధిచేస్తాడు అనే బైబిల్ కథలు

## పరిచయం

### చిన్న బృందంతో చర్చ

మీ సమాజానికి మీరు నాయకులుగా ఎన్నుకోబడ్డారని ఊహించండి. మీ ప్రాంతానికి మీ సమాజాన్ని మాదిరి సమాజంగా మార్చే ప్రాజెక్టును పర్యవేక్షించమని అడిగారనుకోండి. (మాదిరి సమాజం అంటే ఒక పరిపూర్ణమైన సమాజానికి ఉదాహరణవంటిది. అందరూ మిమ్మల్ని చూచి నేర్చుకోవచ్చు అన్నట్లుగా ఉండాలి.)

- మీకు అవసరమైన వనరులలో కొన్ని ఏమై ఉంటాయి? నిపుణులు, డబ్బు, కొత్త రహదారులు, మొ॥న వాటితోపాటు అన్ని విషయాలను ఆలోచించడానికి ప్రయత్నించండి.

### నివేదించే సమయం

***బోధకునికి సూచనలు**: మీరు నివేదికలు వింటుండగా, వారు చేసిన ప్రయత్నాలకు వారిని కృతజ్ఞతలు చెప్పండి. ప్రార్థన, దేవుని శక్తి, దేవుని జ్ఞానం మొదలైన ఆలోచనలు పేర్కొనే బృందాలను గుర్తుంచుకోండి. ఏ బృందంవారు ఈ అంశాలను చెప్పకపోతే, వారు ఏమైనా మర్చిపోయారేమో ఆలోచించమని క్లాసు అంతటినీ అడగండి.*

2 దినవృత్తాంతాలు 7:14 చదవండి.

- మన దేశం స్వస్థతపొందడం చూడాలంటే మనకు అవసరమైనది ఏమిటి?
  - *ప్రార్థన, దేవుని ముఖమును వెదకుట, మన దుష్టమార్గాలను విడచి తిరుగుట*
- వీటిని చేయాల్సినది ఎవరు?
  - *దేవుని ప్రజలు*
- మనం ఈ పనులు చేస్తుండగా దేవుడు ఏమి చేస్తాడు?
  - వింటాడు, క్షమిస్తాడు, మన దేశాన్ని స్వస్థపరస్తాడు!

మనకు మనంగా మన సమాజాన్ని మనం మార్చలేము లేదా దేవుని రాజ్యాన్ని కట్టలేము. ఇప్పటికే మనం లేదా ప్రభుత్వం లేదా ఇతరులు చేసిన అనేక ప్రయత్నాలు మనకు తెలుసు. కాని మన సమాజం రూపాంతరపరచబడడం మనం చూడలేదు. కొన్ని మంచి మార్పులు చూసివుండొచ్చు, కాని పూర్తిగా రూపాంతరం చెందాలంటే దేవుని సహాయం కావాలి. మనం చూసే కొన్ని ఆటంకాలు అధిగమించడానికి ఆయన జ్ఞానం ఆయన శక్తి మనకు అవసరం. ప్రార్థించి, దేవునికి విధేయులుగా మనం నడుస్తుండగా, మన సమాజం మారడం మనం చూస్తాం.

## దేవుని జ్ఞానం

### చిన్న బృందంతో చర్చ

***బోధకునికి సూచనలు:** వారు చర్చించడానికి లేక రాసుకోవడానికి ప్రతి బృందానికి ఒక వాక్యభాగాన్ని, ప్రశ్నలను ఇవ్వడానికి వేరే కాగితాలపై వాక్యభాగాలను, ప్రశ్నలను రాయడానికి **విధ్యార్థి సహకారి** వాడండి. తరువాత ఒక్కొక్క బృందం చదివి, చర్చించడానికి ఒక్కొక్క కాగితం ఇవ్వండి. కొన్ని బృందాలు త్వరగా ముగిస్తే, వారు ఒకరి కాగితాలు ఒకరు మార్చుకొని మరలా చేయమనండి.*

1 రాజులు 3:7–14 చదవండి.

- సొలొమోను ఏమి కావాలని అడిగాడు?
    - *పాలించడానికి తగిన వివేచన, వివేచించే హృదయం*
- దేవుడు ఎలా స్పందించాడు?
    - *ఆయన సంతోషించాడు. అతని ముందుగాని లేక తర్వాతగాని ఎవరికీ లేనంత వివేచన ఇస్తానని, అలాగే ఐశ్వర్యం, ఘనత, దీర్ఘాయుష్షును కూడా ఇస్తానని వాగ్దానం చేశాడు.*

యాకోబు 1:5 చదవండి.

- ఏమి అడగమని యాకోబు మనకు చెబుతున్నాడు?
    - *జ్ఞానం*
- యాకోబు చెప్పినట్లు, దేవుడు ఎలా స్పందిస్తాడు?
    - *మన లోపాలు చూడకుండా, ధారాళంగా ఇస్తాడు.*

కీర్తన 81:11–16 చదవండి.

- ఇశ్రాయేలీయులు ఏమి చేయడంలో విఫలమయ్యారు?
    - *దేవుని మాట వినడం (వ.11,13)*
- వారు వినివుంటే, దేవుడు ఏమి చేసివుండేవాడు?
    - *వారి శత్రువులు, విరోధులను జయించేవాడు*
    - *మంచి పదార్థములతో వారిని పోషించేవాడు*

యెషయా 55:8–9 చదవండి.

- తన మార్గాలు, తన తలంపులను దేవుడు ఎలా వర్ణించాడు?
    - *మన తలంపులు, ఆలోచనలకంటే ఆయన తలంపులు ఆలోచనలు చాలా ఉన్నతమైనవి.*

## నివేదించే సమయం

- ఈ వచనాలన్నిటినుండి మనం ఏమి నేర్చుకోవచ్చు?

మనం జ్ఞానంకోసం అడగాలని దేవుడు కోరుతున్నాడు అని బైబిల్ స్పష్టం చేస్తుంది. మనం అడిగితే ఆయన సంతోషించి ధారాళంగా జ్ఞానాన్ని ఇస్తాడు. కాని మనం దేవుని మాట వినడంలో విఫలమైతే మనం చాలా కోల్పోతాం. మనకన్నా దేవునికి ఎల్లప్పుడూ ఎక్కువగా తెలుసు. మన తలంపులకంటే ఆయన తలంపులు ఉన్నతమైనవి. మన మార్గాలకంటే ఆయన మార్గాలు ఎత్తైనవి.

## పెద్ద బృందంతో చర్చ

ఒక సమాజంలో దేవుడు జ్ఞానాన్ని ఎలా ఇచ్చాడో ఒక కథను విందాం.

ఒక సమాజంలో వారి కల ఒక ట్రాక్టర్ కావాలని. వాళ్ళ ప్రణాళికలో దాన్ని గీసారు కాని దాన్ని కొనడానికి తగిన డబ్బు ఉండడం అసాధ్యంగా అనిపించింది. ప్రతినెలా వారు కూడుకున్నపుడు వారు ప్రార్థించి, దేవుడు తమ సమాజం ఎలా ఉండాలని కోరుకుంటున్నాడో అలా ఉండేటట్లు చూడడానికి తరువాత ఏమి చేయాలో దేవుని అడిగేవారు.

ఒకసారి వారలా కూడుకున్నపుడు, దేవుడు వారితో, ‘కోతకోసే చోటికి వెళ్ళే దారిని వెడల్పుగా చేస్తే, అప్పుడు నేను మీకు ట్రాక్టర్ ఇస్తాను’ అని తమతో చెప్పినట్లు అనిపించింది. వెంటనే సంఘం స్పందించి, ఒక బండి పట్టేటట్లు 3కిలోమీటర్ల పొడవున రోడ్డును వెడల్పు చేసింది. ఆ సంవత్సరం పంటను తమ వీపులపై మోయనవసరం లేకపోయినందున ప్రతిఒక్కరూ చాలా ఎక్కువగా పండిరచగలిగారు. .పంటలను బళ్ళమీద ఎక్కించుకుని వారు దాన్ని మరింత త్వరగా రవాణా చేయగలిగారు. మార్కెట్‌లో అమ్మడానికి మరింత ఎక్కువ తీసుకువెళ్ళారు. అక్కడికి తీసుకువెళ్ళే సరికి అది మరింత తాజాగా ఉంది కాబట్టి వారికి మెరుగైన ధర వచ్చింది. ఆ గ్రామస్తులు సంఘానికి కృతజ్ఞులై అదనంగా వచ్చిన లాభంనుండి కొంత ఇచ్చారు. అది చాలా ఎక్కువ ధనరాసి అయ్యింది!

ఆ సొమ్మును ఎలా వాడాలి అని సంఘం ప్రార్థించి దేవుని అడుగగా, ఆయన వారికి తాను ట్రాక్టర్ కొంటాననే వాగ్దానాన్ని జ్ఞాపకం చేశాడు. ఆ డబ్బుతో ట్రాక్టర్ కొన్నారు.

- సంఘానికి తాను ఏమి చేయాలో ఎలా తెలిసింది?

- వారు చేయాల్సిన పనిని దేవుడు చూపినప్పుడు సంఘం ఎలా స్పందించింది?
- చివరికి ఏమి జరిగింది?

సంఘం దేవునికి విధేయత చూపిన చిన్న కథ ఇది. కాని ఎలా ఆరంభమైందో చూడండి. ప్రతి నెలా వారు కూడుకుని తరువాత ఏమి చేయాలో దేవుని అడిగారు. మనం కూడా అలాగే ఉండాలి. మనం ఏమి చేయాలో దేవుని అడిగి తెలుసుకోవడానికి మనం క్రమంగా కూడుకోవాలి. కొన్నిసార్లు దేవుడు మనకు స్పష్టమైన నిర్దేశాలు ఇస్తాడు. మరికొన్నిసార్లు సరిjైనది అనిపించినది చేస్తూ, అది తప్పయితే దేవుడు మనకు తెలియజేసేటట్లు ఆయనను నమ్మాలి. కాని ప్రతి నెలా జ్ఞానాన్ని ఆశిస్తూ దేవుని అడగడానికి తిరిగి రావాలి. ఆయన మార్గాలు ఎల్లప్పుడూ మన మార్గాలకంటే ఎత్తైనవి అని గుర్తుంచుకోండి.

## దేవుని అభివృద్ధి

ట్రాక్టర్ కథను గుర్తు తెచ్చుకోండి.

- కథలోని ప్రజలు ఏమి చేశారు?
  - *వారు జ్ఞానం కోసం దేవుని అడిగారు, నడిచే దారిని వెడల్పు చేశారు.*
- దేవుడు ఏమి చేశాడు?
  - *ఆలోచన ఇచ్చాడు, ప్రజలు సంఘానికి ఇవ్వడంలో దాతృత్వంగా ఉండేటట్లు చేసి వారు ట్రాక్టర్ కొనుక్కోగలిగేలా చేశాడు.*
- వారు దారిని వెడల్పు చేసివుండకపోతే వారు ట్రాక్టర్ కొనగలిగేవారా?
  - *లేదు*

ఆయన రాజ్యాన్ని కట్టడంలో దేవుడు సుమారుగా ప్రతిసారి మనకు కూడా కొంత పాత్రను ఇస్తాడు. జ్ఞానం కోసం అడగడంతో మనం ఆరంభించాల్సిన అవసరం ఉంది, కాని ఆయన మనకు చూపించేది మనం చేయాలి కూడా. బైబిల్లోని అత్యధికశాతం కథలలో, ప్రజలు అద్భుతాన్ని చూడడానికి ముందు దేవునికి విధేయులు చూపించేవారని గమనించవచ్చు.

### చిన్న బృందంతో చర్చ

***బోధకునికి సూచనలు:*** *3–5మందిని ఒక బృందంగా క్లాసును బృందాలుగా విభజించండి. ప్రతి కథను కనీసం ఒక బృందం అధ్యయనం చేయునట్లు ప్రతి బృందానికి కథలను నియమించండి.* ***విద్యార్థి సహకారి*** *వాడండి లేదా ప్రతి బృందానికి ఇవ్వడానికి వాక్యభాగం, ప్రశ్నలు రాసిన కార్డులు తయారుచేయండి.*

### దావీదు–గొల్యాతు

ఫిలిష్తీయులు, ఇశ్రాయేలీయులు యుద్ధంలో ఉన్నారు. ఫిలిష్తీయులు గొల్యాతు అనే మహాకాయుడ్ని యుద్ధంలోకి పంపి, అతనితో యుద్ధం చేయడానికి ఇశ్రాయేలీయులలో ఒకని పంపమని ప్రకటన ఇచ్చారు. ఆ వ్యక్తి గెలిస్తే ఫిలిష్తీయులు యుద్ధం ఓడిపోయి ఇశ్రాయేలును వదిలివెళ్తారు. గొల్యాతు గెలిస్తే ఇశ్రాయేలీయులు యుద్ధం ఓడిపోయి ఫిలిష్తీయులకు బానిసలుగా జీవించాలి. దావీదుకు యుద్ధానికి వెళ్ళే వయసుకు ఇంకా రాలేదు కాని గొల్యాతు దేవుని ఎగతాళి చేస్తున్నాడని విన్నపుడు యుద్ధం చేయడానికి స్వచ్ఛంధంగా ముందుకు వచ్చాడు.

1సమూ 17:32–49 చదవండి.

- దావీదు ఏమి చేశాడు?
  - *గొల్యాతుతో యుద్ధం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చాడు.*
  - *దేవుడు తనకు విజయాన్నిస్తాడని అతడు ప్రకటించాడు.*
  - *రాజు యుద్ధవస్త్రాలు ధరించుకోకూడదని అతడు నిర్ణయించుకున్నాడు. తనకు అలవాటున్న రాళ్ళు, వడిసెలను వాడాడు.*
- దావీదు ఎందుకు అలా చేశాడు?
  - *దేవుడు ఇశ్రాయేలును రక్షిస్తాడని అతడు నమ్మాడు. దేవుని శక్తిని కనుపరచాలని అతడు కోరుకున్నాడు.*
- ఫలితం ఏమిటి?

- *అతడు గొల్యాతును చంపి విజయం పొందాడు. ఇశ్రాయేలీయులు యుద్ధంలో గెలిచారు.*
- దావీదు యుద్ధానికి వెళ్ళివుండకపోతే ఇది జరిగివుంటుందని మీరు భావిస్తున్నారా?
  - *బహుశ్ృ ా సాధ్యంకాదు. దావీదు వచ్చేంతవరకు దేవుడు జోక్యం చేసుకోలేదు.*

**ఎలీషా, విధవరాలు**

2రాజులు 4:1–7 చదవండి.

- విధవరాలి పరిస్థితి ఏమిటి?
  - *ఆమె తీర్చలేని అప్పులో ఉంది. ఆమె కుమార్తెలు బానిసలుగా కొనిపోబడేలా ఉన్నారు.*
- ఆమె ఏమి చేసింది?
  - *తనకు సహాయం చేయమని దేవుని ప్రవక్తను ఆమె అడిగింది.*
  - *ఆమె తన పొరుగువారినుండి కుండలు పోగుచేసింది. ఆమె ఎలీషా సూచనలు అనుసరించింది.*
- దేవుడు ఏమి చేశాడు?
  - *కుండలన్నీ ఒలీవనూనెతో నిండిరచేటట్లు చేశాడు.*
- ఫలితం ఏమిటి?
  - *అప్పు తీర్చేశారు, కుమారులు రక్షింపబడ్డారు.*

**యెరికో**

యెహోషువ 6:1–5, 12–14, 15–17, 20 చదవండి.

- ఏమి చేయాలని దేవుడు వారికి చూపించాడు?
  - *పట్టణం చుట్టూ తిరిగి, బూరలు ఊదాలి.*
- వారు ఏమి చేశారు?
  - *దేవుడు చెప్పిన ప్రకారం చేశారు.*
- ఫలితం ఏమిటి?
  - *వారు యుద్ధం గెలిచారు. పట్టణ ప్రాకారం కూలిపోయింది.*

**నయమాను**

ఇది నయమాను కథ. అతడు సిరియా సైన్యానికి అధిపతి `అంటే చాలా శక్తిగలవాడు. అయితే అతనికి కుష్ఠరోగం ఉంది. తనను స్వస్థపరచగలిగే ప్రవక్త ఇశ్రాయేలులో ఉన్నాడని అతడు విన్నాడు. కాబట్టి అతడు ఎలీషా ప్రవక్తను కలవడానికి వెళ్ళాడు.

2రాజులు 5:9–14 చదవండి.

- ఏమి చేయమని ఎలీషా అతనికి చెప్పాడు?
  - *యొర్దాను నదిలో ఏడుసార్లు మునగమని చెప్పాడు.*
- నయమాను స్పందన ఏమిటి?
  - *అతనికి కోపం వచ్చింది. అతడు చెప్పిన పని వ్యర్థంగా అనిపించింది. కాబట్టి తాను లోబడడానికి ఇష్టపడలేదు.*
- నయమాను విధేయుడైనప్పుడు ఏమి జరిగింది?
  - *అతడు స్వస్థతపొందాడు.*

**నివేదించే సమయం**

కొన్నిసార్లు మనలను చేయమని దేవుడు చెప్పే పనులు అర్థవంతంగా అనిపించవు. కాని మన సమాజం బాగుపడడం చూడడానికి అన్నిసార్లు దేవుని పాత్ర ఉంటుంది. ఆయన మనకు ఇచ్చిన సూచనలకు మనం విధేయులవ్వడం ఆరంభించాలి `అవి చిన్నవని

అనిపించినా లేక అసంబద్ధంగా అనిపించినాసరే. అంతేకాక మనం విధేయులమైనపుడు మన సమాజానికి దేవుడు స్వస్థతనిస్తాడని మనం విశ్వసించాలి.

### పెద్ద బృందంతో చర్చ

ఈ కథ వినండి.

### భవన నిర్మాణ సామగ్రి

ఒక టిసిటి సమాజంలోని సంఘం, సమాజంలోని ప్రతివారికి పక్కా ఇళ్ళు కట్టించమని దేవుడు వారికి సవాలు చేస్తున్నట్లు భావించారు. వారు ఆ ప్రదేశాన్ని సర్వేచేసి, అక్కడ ఉన్న 35 ఇళ్ళు పడిపోయే స్థితిలో ఉన్నాయని అవి పునర్నిర్మించాలి లేకుంటే కనీసం మరమ్మత్తులు చేయాలని నిర్ణయించారు. కాలగమనాన సంఘ సభ్యులు వనరులు సమకూర్చి, పని పూర్తిచేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అయితే 17వ ఇల్లు కట్టడం పూర్తయ్యాక, మిగిలిన 18 ఇళ్ళు కట్టడానికి తమవద్ద వనరులు లేవని వారు గుర్తించారు. నిరుత్సాహపడి, పని విడిచిపెట్టకుండా పూర్తిచేయడానికి వారు పూనుకున్నారు. ఆ ప్రాజెక్టు పూర్తిచేయడానికి దేవుని సహాయాన్ని కోరుతూ ఒక రాత్రి ఉపవాసం ఉండి ప్రార్థించడానికి సంఘసభ్యులు నిర్ణయించుకున్నారు.

మరుసటి ఉదయం వారు సంఘంనుండి వెళుతుండగా, భవన నిర్మాణ సామగ్రితో నిండిన పెద్ద లారీలు సంఘం బయట ఆగి ఆ సామగ్రిని దింపడం ఆరంభించాయి. గందరగోళపడిన సంఘసభ్యులు, లారీ డ్రైవర్లతో వారు తప్పు అడ్రస్‌కు వచ్చారని వారించబోయారు. ఇక్కడ ఎవరూ ఈ సామాన్లకోసం అడగలేదు, వీటికి ఎవరూ డబ్బు కట్టే పరిస్థితిలో లేరు అని చెప్పారు. లారీ డ్రైవర్లు త్వరగా స్పందించి, ఈ సామగ్రికి సంఘం బాధ్యత వహించనక్కరలేదని, వారికి అవి అవసరం లేకపోతే వారే వాటిని తొలగిస్తారని చెప్పారు. వారితో ఇంకా మాట్లాడితే తేలింది ఏమిటంటే, దగ్గరలోని గోడౌన్‌లో ఈ సామగ్రి అదనంగా ఉన్నందున, కొత్త సామగ్రిని దించుకోవడానికి పాత సామగ్రిని ఇలా బయట పారబోస్తున్నారని. చర్చిముందు ఈ సామాన్లు ఎందుకు పారబోసారని సంఘ నాయకులు లారీ డ్రైవర్లను అడగగా, ''మేము డ్రైవింగ్ చేసి అలసిపోయాం. తిరిగి గోడౌన్‌కు వెళ్ళడానికి ఈ సామాన్లు ఇక్కడ పారబోసేయాలని అనిపించింది'' అని వాళ్ళు చెప్పారు.

అలా సంఘానికి ఈ నిర్మాణ సామగ్రి ఉచితంగా దొరికింది. ఆశ్చర్యం ఏమిటంటే, సమాజంలో మిగిలిన ఇళ్ళు పూర్తిచేయడానికి ఈ సామగ్రి సరిగ్గా సరిపోయింది.

- ప్రతివారికి ఒక ఇల్లు కట్టాలని సంఘం ఎందుకు కోరుకుంది?
- సంఘం ఏమి చేసింది?
- దేవుడు ఏమి చేశాడు?
- సంఘం తాను చేయగలిగినది (17 ఇళ్ళు కట్టడం) మొదట చేయకపోయివుంటే, దేవుడు ఆ సామగ్రిని ఏర్పాటు చేసివుండేవాడని మీకు అనిపిస్తుందా?

మనం బైబిల్లో చూచిన వాక్యభాగాలవలెనే, వారు చేయగలిగింది వారు చేసినప్పుడు, దేవుడు వారి ప్రయత్నాలను అభివృద్ధి చేశాడు గాని దానికి ముందు కాదు. కొన్నిసార్లు దేవుడు తన కృపతో మనలను ఆశ్చర్యపరచే కార్యాలు చేయవచ్చు. కాని లేఖనాల్లో మనం చూచినట్లు –మనం మొదట విధేయత చూపాలని ఆయన చూస్తాడు.

## ప్రార్థన

### పెద్ద బృందంతో చర్చ

ఈ క్రింది వచనాలు చదువుదాం. ప్రార్థనగురించి అవి మనకు ఏమి బోధిస్తాయి?

- యోహాను 14:13
- యోహాను 15:8
- యోహాను 16:23–24

పాఠం 4లో మీరు రాసుకున్న మీ సమాజంలో మీరు చూడాలని ఆశించే మార్పుల జాబితాను మరలా చూడండి. (మీరు రాసిన జాబితా పోతే, మరొక జాబితాను తయారు చేయండి` మీ సమాజంలో మీరు చూడాలని మానసిక, భౌతిక, ఆత్మీయ, సామాజిక మార్పులగూర్చి తలపోయండి.)

- ఈ మార్పులు దేవుడు కూడా మీ సమాజంలో చూడాలని కోరుకుంటాడని మీరు భావిస్తున్నారా?
- అవి ఆయన రాజ్యాన్ని కట్టేవిగా ఉన్నాయా?

## ప్రార్థించండి

మన సమాజంలో దేవుడు ఈ మార్పులు తీసుకువచ్చునట్లు మనం కలసి ప్రార్థించడానికి సమయం తీసుకుందాం.

***బోధకునికి సూచనలు**: ప్రార్థనా సమయం అయిన తర్వాత, కొద్ది నిమిషాలు దేవుని యెదుట నిశ్శబ్దంగా కనిపెట్టండి. దేవుడు వారికి ఏమైనా చూపించాలని ఆశిస్తున్నాడేమో లేక ఈ మార్పులు చేయడానికి ఆయన ఎలాంటి జ్ఞానాన్ని ఇవ్వాలని కోరుతున్నాడో అడగమని ప్రజలకు సూచించండి. 2 నుండి 3 నిమిషాల నిశ్శబ్దం తర్వాత దేవుడు వారికి ఏమైనా చూపిస్తున్నట్లు వారు భావించారేమో ఆ బృందాన్ని అడగండి.*

## ముగింపు

---

### పెద్ద బృందంతో చర్చ

- ఈ పాఠంలో మనం నేర్చుకున్న కొన్ని ముఖ్యమైన తలంపులు ఏవి?
- ఒక బృందంగా ప్రార్థించి, దేవుని స్వరాన్ని వినడానికి సమయం తీసుకోవడంలో మరింత నమ్మకంగా మనం ఎలా ఉండగలం?
- నేడు మనం ప్రార్థిస్తుండగా, మనం చేయాల్సినది ఏమైనా దేవుడు మనకు చూపించాడా? (ఆయన చూపిస్తే, దాన్ని ఆచరణలో పెట్టడానికి ఒక ప్రణాళికను సిద్ధపరచడానికి సమయం తీసుకోండి.)

# పాఠం 7: దేవుని రాజ్య నిర్మాణంలో సంఘం పాత్ర

## ముఖ్యమైన తలంపులు

1. మన సమాజాలలో దేవుని రాజ్యం కట్టడంలో సంఘం చాల ప్రాముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.
2. సంఘంలో ఉన్న ప్రతివ్యక్తి ముఖ్యమైనవారే. ఏదొక రూపంలో దేవుని రాజ్య నిర్మాణంలో వారు పాలుపొందాలి.

## వస్తువులు

1. దృశ్య సహకారం – దేవుని రాజ్య నిర్మాణంలో సంఘం పాత్ర `పోస్టర్
2. దృశ్య సహాకారం – శరీర భాగాల కార్డులు (14) (కత్తిరించడం)

## పరిచయం

---

### పెద్ద బృందంతో చర్చ

పాఠం 5లో మనం రూపాంతర ప్రక్రియను చూశాం – అది మీతో ఆరంభమై, మీ **కుటుంబానికి, సమాజానికి, దేశానికి** ఎలా విస్తరిస్తుందో చూశాం. అయితే ఈ ప్రక్రియలో మరొక ముఖ్యమైన భాగం ఉంది: అది సంఘం.

ఈ గొప్ప దర్శనాన్ని సాధించడానికి, ఈ రూపాంతర పరచే ప్రక్రియలో సంఘం ఒక కీలకమైన పాత్ర పోషించాలనేది దేవుని ప్రణాళిక.

ఎఫెసీ 1:22–23 చదవండి.

- సంఘం పాత్ర ఏమిటి?
  - *యేసు పనిని నెరవేర్చడం*

ఎఫెసీ 3:10 చదవండి.

- తన జ్ఞానాన్ని తెలియజేయడానికి దేవుడు దేన్ని వాడుకుంటున్నాడు?
  - *సంఘాన్ని*

ఈ వచనాలను అర్థం చేసుకోవడం సులువు కాదు గాని తన రాజ్య నిర్మాణంలో దేవుడు సంఘానికి ఒక ప్రత్యేకమైన పాత్రను ఇచ్చాడని అవి జ్ఞాపకం చేస్తాయి. సంఘం క్రీస్తు శరీరం. అన్నిటిని దేవునితో సమాధానపరచే యేసు పనిని పూర్తిచేయడమే సంఘం పాత్ర.

- మీ సంఘం మూతపడిపోతే ఏమి జరుగుతుంది? మీ సమాజంలోని క్రైస్తవేతరులు ఫిర్యాదు చేస్తారా? ఎందుకు చేస్తారు? ఎందుకు చేయరు?

సంఘం సమాజంపై ఎలాంటి ప్రభావం చూపాలంటే, సమాజంలోని సభ్యులు సంఘం వెళ్ళిపోవడం చూచి కృంగిపోవాలి.

దేవుని రాజ్యాన్ని కట్టడాన్నిగూర్చి పాఠం 5లో మనం నేర్చుకున్న ఒక సామాన్యమైన మాదిరిని ఉపయోగించి ఒక చిత్రాన్ని గీద్దాం. మనం వ్యక్తితో ఆరంభించి, కుటుంబానికి, తరువాత సమాజానికి, అటుతరువాత దేశానికి వెళదాం. *(నాలుగు డబ్బాలు గీయండి లేదా **దృశ్య సహకారిని** చూపించండి `దేవుని రాజ్య నిర్మాణంలో సంఘం పాత్రం పోస్టర్).*

*ఈ ప్రక్రియకు సహాయం చేయడమే సంఘం పాత్ర. (బాణం గుర్తులు సూచిస్తూ మధ్యలోని బాక్స్‌లో సంఘం అని రాయండి.)*

సంఘం వ్యక్తులను సిద్ధపరచి, వారు తమ కుటుంబాలను, సమాజాలను, వారి దేశాన్ని ప్రభావితం చేసేటట్లు వారికి సహాయం చేయాలి. మనం కూడా కుటుంబాలు, సమాజాలు దేవుడు ఉద్దేశించినట్లు మారడానికి సిద్ధంచేసే మార్గాలకోసం చూడాలి.



## వ్యక్తులను సన్నద్ధులను /సిద్ధం చేయడం

### పెద్ద బృందంతో కార్యక్రమం

***బోధకునికి సూచనలు**: దృశ్య సహకారిని ఇవ్వండి: బృందంలోని వేర్వేరు వ్యక్తులకు శరీర భాగాల కార్డులు. వారిని నిలువబెట్టి ఒక్కొక్క శరీర భాగాన్ని గుర్తించమనండి. తరువాత పెద్దబృందాన్ని ఈ ప్రశ్నలు అడగండి.*

- ఏ భాగాలు పనికి రానివి లేక ఏ ఉద్దేశం లేకుండా చేయబడ్డాయి?
- శరీరంలోని అతి చిన్న భాగాలు ఏమిటి?
- అతి చిన్న భాగాలే కదా అని వాటిని తీసివేస్తే ఎలాంటి ప్రభావం పడుతుంది?
- అన్ని అవయవాలు వేరువేరుగా ఉంటే, శరీరం ఇంకా పనిచేస్తుందా?
- శరీరంలోని వేర్వేరు అవయవాలకు ఇతర అవయవాలు అవసరం అని చెప్పడానికి కొన్ని ఉదాహరణలు ఇవ్వండి.
- కొన్ని అవయవాలు లేకుంటే, మనం శరీరం ఎంత ప్రభావవంతంగా ఉంటుంది?

***బోధకునికి సూచనలు: వేర్వేరు వ్యక్తులు తమ కార్డులు కింద పెట్టునట్లు చేయండి.***

- **ఇప్పుడు శరీరం చక్కగా పనిచేస్తుందా?**
- **ఈ అవయవాలు పోగొట్టుకుంటే వచ్చే నష్టం ఏంటి?**

***బోధకునికి సూచనలు**: వేర్వేరు సభ్యులు తమ కార్డులు కిందపెట్టమని చెప్పండి.*

- ఇప్పుడు శరీరం పనిచేయగలదా? ఎందుకు పనిచేయదు? 'ముఖ్యమైన భాగాలు ఉన్నాయి కదా? అవునా?

1కొరింథి 12:12–20 చదవండి.

ఇప్పుడు, సంఘం పాలుపొందే కార్యక్రమాల జాబితాను తయారుచేద్దాం.

***బోధకునికి సూచనలు**: బోర్డు లేక చార్టుపై జాబితాను తయారు చేయండి. తరువాత ఈ కింది అంశాలగుండా పరిశీలించండి.*

- శరీరంలో ప్రతి అవయవం ఆవశ్యకమైనదే. సంఘం శరీరంలా ఉండాలని భావిస్తాము అంటే దేవుని రాజ్యాన్ని కట్టడానికి ప్రతి సభ్యుడు అవసరమే. పనికిరాని సభ్యులు ఉండకూడదు. సంఘంలోని ప్రతి సభ్యుడు అవసరమైన పాత్ర పోషిస్తున్నాడా? ఒకవేళ ఎవరైనా సంఘానికి హాజరవ్వడం మానేస్తే సంఘం నడవడం లేదా సంఘ పరిచర్యలపై ప్రభావం చూపదు అని అనుకుంటున్నారా?
- సంఘంలో ఎంతశాతం పాల్గొంటున్నారు? (ఒకవేళ ఎంత శాతమో చెప్పడం కష్టమైతే, సంఘానికి ఎంతమంది హాజరౌతున్నారు? ఆరాధనా కార్యక్రమాల్లో ఎంతమంది పాలుపొందుతున్నారు?) శరీరంలో ఎంత శాతం పాల్గొనడం లేదు లేదా వాడబడడం లేదు? (సుమారుగా అంతశాతం విధ్యార్థులను తమ కార్డులు కిందపెట్టమని చెప్పండి.)
- మీ సొంత శరీరం కూడా అంత శాతమే పనిచేస్తుంటే ఎలా ఉంటుంది? సంఘం విషయంలో కూడా ఇది వాస్తవమేనా? సంఘంలో అత్యధికశాతం పాల్గొంటే సంఘం మరింత ప్రభావవంతంగా ఉంటుందంటారా?
- ఈ సమస్య పరిష్కారానికి మనం ఏమి చేయగలం?

## ప్రతి ఒక్కరూ ఎందుకు పరిచర్య చేయాల్సివుంది?

### పెద్ద బృందంతో చర్చ

ఎఫెసి 2:10 చదవండి.

- మనం ఏమి చేయడానికి రక్షింపబడ్డాం?
- రక్షింపబడిన వారందరూ సత్క్రియలు చేయాలా లేక కొందరేనా?
- మీ సంఘంలో అందరూ సత్క్రియలు చేస్తున్నారా?

మత్తయి 25:14–30 చదవండి – తలాంతుల ఉపమానం.

- ఈ ఉపమానం చదువుతుండగా, దేవుని రాజ్యాన్ని కట్టడానికి తమ తలాంతులను వాడనవసరం లేని క్రైస్తవులెవరిగూర్చైనా అది సూచిస్తుందని మీకు అనిపించిందా?
- మీ సంఘంలోని క్రైస్తవులందరూ తమ తలాంతులను పూర్తిగా వాడుతున్నారా?
- దేవుని రాజ్యాన్ని కట్టడానికి మరింతమంది తమ తలాంతులను పూర్తిగా ఉపయోగించడంలో మనమెలా సహాయపడగలం?

దేవుని రాజ్యాన్ని కట్టడానికి మనం అందరం కలసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ఒక వ్యక్తి దేవుని రాజ్యంలోని ఒక చిన్న భాగాన్ని కట్టగలిగితే, సంఘం అంతా తమ జీవితంలోని రపతి విభాగంలో దేవుని చిత్తానుసారంగా జీవించడం ఆరంభించి, ఇతరులు కూడా అలా జీవించడానికి సహాయపడగలిగితే, మనం దేవుని రాజ్యాన్ని మరింత ప్రభావవంతంగా కట్టగలం. మీ సంఘంలోని ప్రతి ఒక్కరు తమ సొంత జీవితాలలో, సంఘంలో, సమాజంలో దేవుని చిత్తం జరగడం చూడాలని సమర్పణ చేసుకోవడాన్ని ఒకసారి ఊహించండి. సంఘంపై, సమాజంపై అది ఎంత ప్రభావాన్ని చూపుతుందో కదా!

ఎఫెసీ 4:11–12 చదవండి.

- నాయకుల (అపొస్తలులు, ప్రవక్తలు, సువార్తికులు, కాపరులు, ఉపదేశకులు) పాత్ర ఏమిటి?
- అనేక సంఘాలలో చెబుతుంటారు`10% ప్రజలు 90% పని చేస్తారని. మీ సంఘంలో ఇలాగే జరుగుతుందా? దాన్ని మనం ఎలా మార్చగలం?
- ఇతరులు పరిచర్యలు చేసేటట్లు వారిని నిర్మించే పనిలో మనం ఎలా పనిచేయగలం?

ఇక్కడొక ఉదాహరణ ఉంది:

ఇతరులకు పరిచర్య చేసేవారే చాలా ఎక్కువగా నేర్చుకుంటారు, ఎదుగుతారు అని తరచూ చెబుతుంటారు. ఇండొనేషియాలో యవ్వనస్తులతో పనిచేసే కొందరు మిషనరీలు ఉన్నారు. ఆ మిషనరీలు యవ్వనస్తులకు వారంవారం నేర్పిస్తున్నప్పటికీ, ఆ క్రైస్తవులు ఎంత బలహీనంగా ఉన్నారో, ఎంత నెమ్మదిగా ఎదుగుతున్నారో చూచి నిరాశపడేవారు. ఆ యవ్వనస్తులు పరిచర్య చేయడం ఆరంభించాల్సిన అవసరత ఉందని వారు నిర్ణయించారు. కాబట్టి ఏదొక పరిచర్య చేసేవారు మాత్రమే వారంలో జరిగే తర్ఫీదుకు అనుమతించబడతారని వారొక కొత్త నియమాన్ని స్థాపించారు. యవ్వనులలో అధికశాతం వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తమ సమాజంలోని ఒక పేద కుటుంబాన్ని సువార్తతో సందర్శించడం మొదలు పేద పిల్లలకు ట్యూషన్ చెప్పి పిల్లల పరిచర్యలో సహాయం చేసేపని వరకు అన్నీ చేశారు. కొద్ది నెలలలోనే యవ్వనస్తులు నిజంగా తమ విశ్వాసంలో వృద్ధిచెందడం మిషనరీలు చూడగలిగారు.తమ బైబిల్ చదివి, ప్రార్థించడం అవసరం అని వారికి ఇప్పుడు తెలిసింది. ఇతరులకు సహాయం చేయడానికి దేవునియందు విశ్వాసం అత్యావశ్యకమని ఇప్పుడు వారు గ్రహించారు.

- ఈ కథలో ఏమి జరిగింది?
- యవ్వనస్తులు పరిచర్య చేయడం ఆరంభించిన కొన్ని విధానాలు ఏమిటి?
- సంఘంద్వారా పరిచర్య చేయడంలో మరింత పాలుపొందడం ఆరంభించినవారు త్వరగా వర్ధిల్లడం మీరు చూచారా?
- పరిచర్య చేయడం ఆరంభిస్తే ప్రజలు పరిపూర్ణులవుతారు అని మీరు ఎందుకు భావిస్తున్నారు?
- ఈ కథనుండి మనం నేర్చుకోవలసిన ముఖ్యమైన అంశం లేక పాఠం ఏమిటి? *(ఇతరులకు సేవచేస్తే మన విశ్వాసం కట్టబడుతుంది అని).*

## కుటుంబాలను రూపాంతరపరచడం

దేవుడు ఉద్దేశించినట్లుగా కుటుంబాలు జీవించడానికి సహాయం చేసే పాత్రను సంఘం పోషించగలదు.
కుటుంబానికి ఉన్న ప్రాధాన్యతను గూర్చి బైబిల్లో చాలా విషయాలు చెప్పారు. నిజానికి ఎఫెసీ 5:25`33లో, భార్యభర్తలమధ్య ఉండాల్సిన సంబంధం యేసుకు సంఘానికి మధ్య ఉన్న సంబంధాన్ని ప్రతిబింబించేలా ఉండాలని దేవుడు చెబుతున్నాడు. మరొకలా చెప్పాలంటే, ప్రజలు క్రైస్తవ దంపతులను చూచినపుడు, భర్త తన భార్యతో వ్యవహరించే విధానంబట్టి యేసు సంఘంతో ఎలా వ్యవహరిస్తాడో అని చూడగలిగేటట్లు ఉండాలి. కుటుంబం ప్రాముఖ్యమైనది.

సమాజంలోని కుటుంబాలు బలంగా ఉంటే, సమాజం కూడా బలంగా ఉంటుంది. అయితే కుటుంబాలు విడిపోయినా లేక బలహీనంగా ఉన్నా సమాజం కూడా విడిపోతుంది లేదా బలహీనంగా ఉంటుంది.

కాబట్టి వ్యక్తులు తమ కుటుంబాలకు పరిచర్య చేసి దేవుడు ఉద్దేశించినట్లుగా తమ కుటుంబాలు జీవించునట్లు సహాయం చేయడానికి వారికి సహాయపడేటట్లు సంఘం అవకాశాలకోసం చూడాలి. అలా చేయడంవల్ల, సంఘంలోని కుటుంబాలను చూచి ఇతరులు నేర్చుకుంటారు తద్వారా సమాజంపై ప్రభావం చూపగలుగుతారు. మన కుటుంబాలు బలంగా తయారౌతుండగా, మన సమాజం, దేశం కూడా బలోపేతం అవుతుంది.

### చిన్న బృందంతో చర్చ

- కుటుంబాలు బలంగా ఎదగడానికి సంఘం సహాయపడగలిగే కొన్ని విధానాలు ఏమిటి?
  - *సంఘ సభ్యులకు, సమాజంలోనివారికి వివాహం, కుటుంబానికి సంబంధించిన కోర్సులు*
  - *పిల్లలను పెంచడంగూర్చిన కోర్సులు*
  - *పిల్లలకు తర్ఫీదునివ్వడానికి సహాయపడే యవ్వనుల, పిల్లల క్లాసులు*
  - *సంఘంలో, ఆరాధనలో, సమాజంలో కలసి పరిచర్య చేసే అవకాశాలు కుటుంబాలకు ఇవ్వడంద్వారా (ప్రేమతో కూడిన క్రియలు)*

### నివేదించే సమయం

### సమాజాలను రూపాంతరపరచడం

---

## పెద్ద బృందంతో చర్చ

ఒక సంఘంగా మన సమాజాన్ని మనం అనేక విధాలుగా ప్రభావితం చేయవచ్చు. సమాజాన్ని ప్రభావితం చేయడానికి ముఖ్యమైన మూడు మార్గాలు ఏమిటంటే:

### 1. క్రైస్తవుల సంఖ్య పెంచడం

ఇది మన సంఘం పెద్దదవ్వడం అనే అర్థాన్నే ఎల్లప్పుడూ ధ్వనించదు. (గొఱ్ఱెలను దొంగిలించడం 'అంటే ఇతర సంఘాలనుండి విశ్వాసులను లాక్కోవడం' ద్వారా కూడా మనం సంఘాన్ని పెంచుకోవచ్చు) క్రైస్తవుల సంఖ్య పెంచడం అంటే క్రైస్తవేతరులలో అనేకులు దేవుని తెలుసుకుని, క్రీస్తును తమ సొంత రక్షకునిగా స్వీకరించడం. ప్రజలు సువార్తను అర్థం చేసుకోవడానికి, కొత్త విశ్వాసులను శిష్యులుగా తీర్చిదిద్దడానికి సంఘాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి.

### 2. దేవునికి విధేయులుగా జీవించడం సమాజానికి నేర్పడం

మనం నేర్చుకున్నట్లు 'మనలను సృష్టించినవాడు దేవుడు కాబట్టి మనకు ఉత్తమమైనది ఏమిటో ఆయనకే తెలుసు. మనం ఎలా జీవించాలి అనేది ఆయన బైబిల్లో బయల్పరచాడు. మనం కూడా ఇతరులకు బైబిల్లోని ప్రాథమిక సూత్రాలను బోధించవచ్చు. ప్రజలు తమ జీవితంలోని ప్రతి విభాగంలో దేవునికి విధేయులుగా జీవించడానికి సహాయం చేయడానికి అవకాశాలకోసం సంఘంగా మనం చూడడం ఆరంభించాలి. క్రైస్తవ్యాన్నిగూర్చి ఆసక్తి చూపనివారు సహితం ఆరోగ్యంగూర్చి, బలమైన వివాహాన్నిగూర్చి తెలివిగా ధనాన్ని నిర్వహించడం ఎలా అనే విషయాలనుగూర్చి నేర్చుకోవాలనే ఆసక్తికలిగివుండే అవకాశం ఉంది. ఇలాంటి తర్ఫీదులు ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి సహాయపడడమే కాక వారు బైబిల్ నియమాల ప్రకారం జీవిస్తుండగా క్రైస్తవేతరులకు సంఘానికి మధ్య మంచి సంబంధాలను కట్టడానికి కూడా సహాయం చేస్తాయి.

### 3. సేవా కార్యక్రమాలద్వారా దేవుడు కోరుకున్నట్లుగా జీవించడానికి వారి సమాజానికి సహాయం చేయండి

దేవుని ప్రేమనుగూర్చి, అనుదిన జీవితంలో ఆయన చిత్తాన్నిగూర్చి వినడం మాత్రమే మన సమాజానికి ముఖ్యమైనవి కాదుగాని దాన్ని చూడడం కూడా ముఖ్యమే! దీనిగూర్చి బైబిల్ మనకు నేర్పించేది చూద్దాం.

### చిన్న బృందంతో చర్చ

ఈ వచనాలు చదివి, కింది ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి:

- మత్తయి 20:28 – యేసు ఎందుకు వచ్చాడు?
- ఫిలిప్పీ 2:4-9 – పౌలు యేసును ఎలా వర్ణించాడు?

- యాకోబు 1:27 – ఎలాంటి భక్తి దేవునికి ఇష్టం?
- మార్కు 12:31 – మనం ఏమి చేయాలని దేవుడు ఆజ్ఞాపించాడు?

## నివేదించే సమయం

యేసు పరిచర్య చేయడానికి వచ్చాడు. నిజానికి '**దేవుని స్వరూపము గలవాడైయుండి**' అని బైబిల్ చెప్పినపుడు దాని అర్థం 'ఆయన దేవుడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని ఎంచుకొనలేదు గాని ... దాసుని స్వరూపమును ధరించుకొని తన్ను తానే రిక్తునిగా చేసికొనెను'. ఒకసారి ఊహించండి` ఆయన దేవుడు కాని తనను తాను రిక్తునిగా చేసుకుని దాసుని స్వరూపాన్ని ధరించాడు! సేవ చేయడం దేవుని స్వభావం! సంఘం క్రీస్తు శరీరం కనుక సంఘానికి ఉండాల్సిన స్వభావం కూడా సేవచేయడం.

## పెద్ద బృందంతో చర్చ

దేవునిపట్ల మన పొరుగువారిపట్ల మనకున్న ప్రేమ మనలను సేవచేయడానికి పురికొల్పాలి. అదేవిధంగా క్రీస్తు సేవచేయడానికే వచ్చినట్లుగా సంఘానికి ఉన్న ఉద్దేశం కూడా ప్రజలు క్రీస్తును ఎరిగి, ఆయనలో ఎదుగునట్లు ఆయన ప్రేమను ఇతరులకు చూపించడమే. మనం మన సమాజాలకు సేవచేస్తుండగా వారు రూపాంతరం చెందడం చూస్తాం. సంఘం పరిచర్య చేయగా రూపాంతరం పొందిన ఒక సమాజాన్ని గూర్చిన కథను చదువుదాం.

### సమాజ పాఠశాల

పారవేసిన రేకులతో, విరిగిపోయిన చెక్కతో చేసిన గృహాలున్న గుడిసెలున్న మురికివాడు కాగ్నిషు. దానిలో 15మంది సభ్యులున్న సంఘం ఉంది. ఈ సంఘానికి సంపూర్ణరీతి సేవా తర్ఫీదు సదస్సుకు హాజరవ్వడానికి ఆహ్వానం అంది, మెషాకు అనే 21 సంవత్సరాల వయస్సున్న సభ్యుడు పాల్గొనడానికి ఎన్నుకోబడ్డాడు. మెషాకు ఒక కొత్త దర్శనంతో తిరిగివచ్చాడు: 'యేసుకు విధేయత చూపడం అనేది మనకు ఇష్టమయితేనే కాదు అని నేను నేర్చుకున్నాను!' కాబట్టి మేషాకు, డిస్మస్ అనే ఒక సంఘపెద్ద, పాస్టర్, పాస్టర్ భార్య ప్రార్థించి, తమ సమాజానికి దేవుని ప్రేమను కనుపరచే ఒక ప్రాజెక్టును ఇవ్వమని దేవుని అడిగారు. జవాబు వచ్చింది: పిల్లలకోసం సంఘంలో ఒక ప్రాథమిక పాఠశాల ఆరంభించమని.

వెంటనే వారు సంఘ సభ్యులలో పిల్లలుగలిగి కొంచెం స్కూలు ఫీజు కూడా కట్టలేనివారితో మాట్లాడారు. ఈ కొత్త 'స్కూలు' కు తమ పిల్లను పంపించడానికి చాలామంది అంగీకరించారు. ఎలాంటి తర్ఫీదు లేని మెషాకు, పాస్టరు, పాస్టరు భార్య 6నుండి 12 సంవత్సరాల వయస్సున్న 13మంది పిల్లలకు, డెస్కులు, పుస్తకాలు, ఎలాంటి సామగ్రి లేకుండానే ఒక్కగదిలో నడిపించే సంఘంలోనే బోధించడం ఆరంభించారు. మెషాకుకు మొదటి జీతం ఏడవనెలలో అందింది` అది పిల్లల తలిదండ్రులలో ఒకరు ఫీజు/కానుకగా ఇచ్చిన ఒక్క అమెరికా డాలరు.

మెషాకు, డిస్మసులు పొరుగున ఉన్న పిల్లలను ఆహ్వానించారు కాబట్టి స్కూలు పెరిగింది. త్వరలోనే వేర్వేరు వయసుల్లోని 45మంది పిల్లలు ఒకేగది తరగతిలో చేరారు. ఆరవ నెలలో రెండవ ఉపాధ్యాయుడు స్వచ్ఛందంగా రాగా, ఎనిమిదవ నెలలో మూడవ ఉపాధ్యాయుడు వచ్చాడు. 100మంది విధ్యార్థులతో, ఉపాధ్యాయులు గది మధ్యలో తమ క్లాసులకు ఎదురుగా, ఒకరి వీపులకు మరొకరి వీపులు ఉండేటట్లు నిలబడి చెప్పేవారు. పొరుగువారు ఖాళీ చేసేసరికి స్కూలుకు మరింత స్థలం దొరికింది. స్కూలు ఆరంభించి రెండు సంవత్సరాలయ్యేసరికి, అది రెండు బిల్డింగులలో 10 గదులకంటే ఎక్కువగా సమకూడాయి. వాటిని ఆదివారం సంఘానికి కూడా వాడేవారు.

తరువాత సంవత్సరం సంఘంవారు దగ్గరలోని కవాగ్వారేలో ఒక స్థలం కొని, శాశ్వతమైన కట్టడం నిర్మించి అక్కడికి మార్చారు. ఆరవ సంవత్సరానికి 17మంది జీతంతో పనిచేసే ఉపాధ్యాయులు, ఐదుగురు బోధనేతర సిబ్బందితో 445మంది పిల్లలు ఉన్నారు. అది ఆ సమాజానికి, స్కూలుకు, సంఘానికి కేవలం ఆరంభం మాత్రమే. ఈ ప్రయత్నానికి ఫలితంగా దగ్గరలోని మరొక గ్రామంలో 10మంది సిబ్బంది, 60మంది విధ్యార్థులతో కొత్త సెకండరీ స్కూలు మొదలైంది. తల్లులు తప్పక పనిచేయాల్సిన పరిస్థితులో ఉన్న 20మంది పిల్లలతో మరొక సంఘం ఒక డే`కేర్ స్కూలు ఆరంభించింది. అసలైన సంఘ సహవాసం 60మంది సభ్యులకు పెరిగి, 40మంది సభ్యులున్న మరొక సంఘాన్ని స్థాపించింది కూడా. ఈ సంఘాలు ఒక్కొక్కటి వేరే ప్రాంతాల్లో మరొక రెండు సంఘాలు కట్టాయి.

ఒక చాలా చిన్న సంఘం, దాని సభ్యులు విధేయులై, త్యాగం చేసిన ఆరు సంవత్సరాలకు దాని ప్రభావం ఆ ప్రాంతంలోని సమాజాలలో, సంఘాలలో కనిపించింది.నిజానికి కాగిషులో రూపాంతరం చెందడం నిరూపించబడిరది ఎలా అంటే, ఆ సమాజ సభ్యులు తమ సమాజానికి కాగిషు (అంటే ''కత్తి'' అని అర్థం) అనే పేరును తీసేసి రూయిటా (అంటే ''ప్రమాదకరమైన దానిని తొలగించడం'') అని పిలవాలి అని సూచించడం.

- ఈ కథలో ఏమి జరిగింది?
- మొదటిలో సంఘం ఎంత పెద్దదిగా ఉంది?
- వారు చేసిన దాని ప్రభావం ఏమిటి?

### పంటలను కోయడం

ఒక గ్రామంలో ఉన్న ఆచారం ఏమిటంటే పంట కోతకు వచ్చినపుడు, సమాజంలోని సభ్యులందరూ కూడుకుని ఒకరి పొలంలో కోతకు ఒకరు సహాయం చేసుకునేవారు. అయితే కోతకోసే సమయంలో తన పొలంలో తనకు సహాయం చేస్తున్నవారికి వారు పనిచేసినన్ని రోజులు భోజనాలు, పానీయాలు ఆ పొలం యజమాని చేయాలి.

దురదృష్టవశాత్తు ఆ భోజన పానీయాల విలువ ఎంత ఉండేదంటే, తరచుగా ఆ పొలం యజమానికి ఆ పంటనుండి చాలా తక్కువ లాభం మిగిలేటట్లుగా ఉండేది.

తమ ప్రేమను కనపరచడానికి ఒక సంఘం ఏమని నిర్ణయించిందంటే, సమాజంలోని కొందరు పేద కుటుంబాలు తమ పంటను కోసినప్పుడు సహాయం చేయడానికి, దానికి ప్రతిఫలంగా ఏమీ ఆశించకూడదని. వారు తమ భోజనం తామే తెచ్చుకొని భోజన సమయంలో తినేవారు. పేదలకు సంఘం సేవచేసే విధానం చూసిన ఇతర సమాజంలోని సభ్యులు కూడా తాము ఇతరులనుండి భోజన పానీయాలు ఆశించకుండా సహాయం చేయడానికి నిర్ణయించుకున్నారు.

నేటిదినాన ఒకరికొకరు పొలాల పంటకోయడానికి సహాయం చేసుకుంటున్నారు. ఎలాంటి ఆహారం లేక మద్యం ఏర్పాటు చేయనక్కరలేకుండానే. అందువల్ల రైతులకు తమ పంటమీద వచ్చే ఆదాయం బాగా పెరిగింది. తత్ఫలితంగా వారికి సంవత్సరం అంతా తినడానికి తగినంత ఆహారం ఉంటున్నది.

- ఈ సమాజానికి సహాయం చేయడానికి సంఘం ఏమి చేసింది?
- దాని ప్రభావం ఏమిటి? మొత్తం సమాజమంతటికీ అది ఎలాంటి మార్పును తెచ్చింది?

### ముగింపు

---

### చిన్న బృందంతో చర్చ/కార్యక్రమం

- సమాజానికి సేవచేయడానికి మన సంఘం చేయగల కొన్ని పనులు ఏమిటి?
- వ్యక్తులు దేవుని ఉద్దేశాలప్రకారం జీవించగలగడానికి మన సంఘం ఎలా సహాయపడగలదు?

### నివేదించే సమయం, ప్రార్థన

ప్రతి బృందం తమ ఆలోచనలను క్లాసుతో పంచుకోనివ్వండి. మన సమాజానికి ఎలా సేవచేయాలి, దేవుడు ఉద్దేశించినట్లుగా ఎలా బ్రతకాలో చూపమని దేవుని ప్రార్థించి ముగించండి.

# పాఠం 8: తరువాత అడుగులు

**ముఖ్యమైన తలంపు**: మనం ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రేమపూర్వక కార్యాలవంటి ముఖ్యమైన విషయాలపట్ల ఉద్దేశపూర్వకంగా ఉండాల్సిన అవసరం ఉంది.

**వస్తువులు**

1. విధ్యార్థి సహకారి: ప్రేమపూర్వకమైన పనుల ప్రణాళిక దశలు
2. పాఠం 4నుండి మార్పుల జాబితా

**ప్రణాళిక చేయడం ఎందుకు ముఖ్యమైనది?**

---

## పెద్ద బృందంతో చర్చ

మరొక కథ చదువుదాం:

లిమ్ ఒక రైతు. విత్తనాలు విత్తడానికి తన పొలాన్ని సిద్ధపరచడానికి వెళ్ళాడు. దారిలో ఉండగా, తన భార్య కోళ్ళకు మేతవేయమని చెప్పిన సంగతి గుర్తువచ్చింది. కాబట్టి ఇంటికి వెళ్ళి, కోళ్ళమేత తీసుకుని, కోళ్ళకు మేత వేయడానికి వెళ్ళాడు.

అతడు కోళ్ళకు మేత వేస్తుండగా, మేకల దొడ్డి విరిగిపోయి వుండడం అతడు గమనించాడు. దాన్ని వెంటనే బాగుచేయకపోతే మేకలు తప్పించుకుపోతాయి అని అతనికి చింతపట్టుకుంది. ఇంటికి తిరిగివెళ్ళి ఆ మేకలదొడ్డిని కట్టడానికి తీగకోసం వెదికాడు. తనదగ్గర సరిjైన పరికరాలు లేకపోవడంతో, అతడు సన్ అనే తన పొరుగువానివద్ద కావలసిన పరికరాలను అడగడానికి వెళ్ళాడు. ఎలాగూ వెళ్ళాను కదా అని సంఘంలోకి కొత్తగా వచ్చి, కొన్ని కష్టాలలో ఉన్నాడని విన్న సన్‌తో కొద్ది నిమిషాలు మాట్లాడడానికి నిర్ణయించుకున్నాడు.

11:30కు సన్ భార్య భోజనం చేస్తారా అని అడిగింది. సమయాన్ని గుర్తించిన లిమ్ వద్దని చెప్పి, తన కుటుంబంతో భోజనం చేయడానికి త్వరగా ఇంటికి వెళ్ళాడు. కొంచెంసేపు కునుకు తీసిన తర్వాత, మేకలదొడ్డిని బాగుచేయడానికి వెళ్ళాడు. ఆ పని పూర్తిచేస్తుండగా, అతని భార్య నీళ్ళపైపు పనిచేయడం లేదని అతనికి గుర్తుచేసి, సన్ పరికరాలు ఉన్నాయి కాబట్టి దాన్ని కూడా బాగుచేయమని చెప్పింది. చీకటి పడుతుండగా అతడు ఆ పంపును సుమారుగా బాగుచేసేసాడు. అయినా ఆ రోజు ఇక విత్తనాలు వేయడానికి పొలానికి వెళ్ళలేకపోయాడు. కాని తరువాత రోజు పంపు పని పూర్తిచేయవచ్చని తృప్తిచెందాడు. మరుసటిరోజు ఆ పని పూర్తిచేసి పరికరాలు తిరిగి ఇచ్చేయవచ్చు. తరువాత విత్తనాలు విత్తడం మొదలుపెట్టవచ్చు.

- ఈ కథలో ఏమి జరిగింది?
- అతడు చేసిన పనులు చెడ్వఆ లేక అవసరమైనవా?
- ఒక రైతు తన పొలాన్ని ఇలా నిర్వహిస్తూ, విత్తనాలు విత్తకపోతే, చివరికి ఫలితం ఏమౌతుంది?
- మీకు ఇలాంటి రోజులు ఉన్నాయా?
- ఇలా మనకు జరగకూడదంటే ఏమి చేయాలి?

అనేకసార్లు సమాజానికి సేవచేయాలనే మన ప్రయత్నాలు ఈ రైతు జీవితంలో రోజులా ఉన్నాయి. ఏది అన్నిటికంటే ముఖ్యమైనదో తెలుసుకుని చేయకుండా, అక్కడనుండి ఇక్కడికి పరుగులుపెడుతూ తీరికలేకుండా జీవిస్తున్నాం. మొదటిగా మనం నిర్ణయించుకోవలసింది మనం చేయాల్సిన ముఖ్యమైన పనులు ఏమిటి అనేది. ఏది ముఖ్యమైనదో మనకు తెలిస్తే, మన సమయాన్ని ఏవిధంగా ఖర్చు చేయాలో అనే విషయాన్నిగూర్చి మంచి నిర్ణయాలు తీసుకోవడానికి మనకు సహాయం చేస్తుంది.

- రానున్న మూడు నెలల్లో, మీ సమాజంలో దేవుని రాజ్యాన్ని కట్టడంలో విజయవంతం కావడానికి మీరు చేయాల్సిన ముఖ్యమైన కొన్ని పనులు ఏమిటి?
    - *ప్రార్థించి, దేవునితో సమయం గడపాలి. మన అనుదిన కార్యక్రమాల్లోనికి దేవుని తెచ్చుకోవడంవల్ల మనకు అత్యంత ప్రాముఖ్యమైనది ఏమిటో మనం గుర్తించగలుగుతాం.*
    - *ఇతరులకు బోధించడం 'శరీరంలోని ఎక్కువ భాగాలు సేవచేయాలని మనం కోరితే, మనం అప్పటికే నేర్చుకున్న కొన్ని పాఠాలను ఇతరులకు నేర్పించాలి.*
    - *ప్రేమగల కార్యాలను నిర్వహించడం 'ఒక క్రమమైన పద్ధతిలో ప్రేమపూర్వకమైన కార్యాలను చేయడం మనం కొనసాగించాలి.*
    - *క్రీస్తు శరీరంగా ఒకరినొకరు బలపరచడానికి ప్రోత్సహించడానికి మనం క్రమంగా కూడుకోవాలి.*

## కూటములు

### పెద్ద బృందంతో చర్చ

ఈ పాఠంలో మనం ప్రేమపూర్వక కార్యాలపై దృష్టిపెడుతున్నాం. ప్రేమపూర్వ కార్యాలు చేయాలనే మీ కోరికను అనుసరించే క్రమంలో, ఆ ప్రేమపూర్వక కార్యాలు క్రమంగా చేయడానికి ఒక బృందాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఇది సంఘ కమిటీ అయివుంటుంది. ఇది సంఘ కమిటీ అప్పటికే నెలకు కొన్నిసార్లు కూడుకుంటూ ఉంటే ఆ కూటంలోనే చేయవచ్చు.

- మీరు కూడుకున్నపుడు ఏమి చేయాలి?
  - **ప్రార్థించాలి –** మన సమాజాలు మారడం మనం చూడాలంటే అది దేవుని బలంవల్లనే స్ధ్యాం. రూపాంతరపరచడం గూర్చి మనం గంభీరంగా ఆలోచిస్తే, కలసి ప్రార్థించే సమయాన్ని తీసుకోవాల్సి ఉంటుంది.
  - మీ సమాజానికి సహాయం చేయగలిగే పనులనుగూర్చి ఆలోచించండి.
  - కొత్తగా ప్రేమగల కార్యాలు చేయడానికి నిర్ణయాలు తీసుకోండి.

మీ సమావేశాలలో సమాజంలోని అవసరతలనుగూర్చి ప్రార్థించాలి, చర్చించడానికి సమయం తీసుకోవాలి. మీరు సహాయం చేయాలా, **ఎలా** చేయాలి అనే విషయమై ప్రార్థించండి. దానితోపాటు మీరు అంతకుముందు చేసిన ప్రేమగల కార్యాన్నిగూర్చి చర్చించాలి – అది సరిగ్గా జరిగిందా లేదా? వచ్చేసారి దానికన్నా భిన్నంగా ఏమి చేయగలరు?

## ప్రేమపూర్వక కార్యాలు

### పెద్ద బృందంతో కార్యక్రమం

ఒక బృందంగా, ప్రేమపూర్వక కార్యాల లక్షణాలను సమీక్షించండి.

***బోధకునికి సూచనలు****: ఈ లక్షణాలు ఒక్కొక్కటి మీరు చదువుతుండగా, ఆ లక్షణాల వివరణను క్లాసులోనివారు గుర్తుపెట్టుకోగలరో లేదో చూడండి.*

1. **దేవుని ప్రేమను చూపడానికి చేసేవి**

   మన లక్ష్యం ప్రజల మతం మార్చడం కాదు (ప్రజలు దేవుని తెలుసుకోవాలనేదే ఎల్లప్పుడూ మనం కోరే విషయం) కాని వారికి ప్రేమను చూపడం. మనం చేసే ప్రేమపూర్వక పనులనుబట్టి వాళ్ళు సంఘానికి వచ్చేలా చేస్తున్నాం అని వాళ్ళు భావించేటట్లు ఉండకూడదు.

2. **దేవునిపట్ల విధేయతతో చేసేవి**

   దీని అర్థం కొన్నిసార్లు మనం చేసే ఈ ప్రేమపూర్వ కార్యాలకు అర్థం ఉండదు అని. సమాజంలోని అతి పేదవ్యక్తికి మనం ఏదో చేయడానికి మనకు మనమే ఎంచుకోము. కాని దేవుడు ఏమి చేయమని మనకు చూపుతున్నాడో అది మనం చేస్తాం `అది ఒక రౌడీని ప్రేమచూపే విషయమైనాసరే!

3. **చిన్నవి, సామాన్యమైనవి**

   మనం చేసే ప్రేమపూర్వక పనులు చిన్నవిగాను సామాన్యమైనవిగాను ఉండాలని కోరుకుంటాం. ఎందుకంటే అలాంటివి చేయడం సులువు, అనేకులు కూడా పాల్గొనవచ్చు.

4. **స్థానిక వనరులను ఉపయోగించి చేసేవి**

   మన సమాజంలో ఉన్న వనరులనే మనం వాడుకోవాలని కోరుకుంటాం. ఎవరో దాత ఇస్తే చేస్తామని కాక మన సొంత వనరులను వాడడం అనేది మన సమాజంపై మనకున్న ప్రేమను మరింతగా కనుపరస్తుంది. మనకున్నది మనం వాడినప్పుడు తరచూ దేవుడు వాటిని అత్యధికం చేస్తాడు.

5. **దేవుని బలంతో చేసేవి**

   మన సొంత శక్తితో ప్రేమపూర్వక కార్యాలు చేస్తే మనం బలం త్వరగా కరిగిపోతుంది. నీకు కావలసిన బలాన్ని ఇవ్వమని దేవుని ప్రార్థించి అడగాలి.

6. **సాధ్యమైనంతమందిని పాల్గొనేలా చేయాలి**

మనం చేసే ప్రేమపూర్వక కార్యాలలో సాధ్యమైనంత ఎక్కువమంది పాల్గొనేటట్లు చేయాలని కోరుతాం. కేవలం ఇచ్చేవారుగా మాత్రమే కాక, వారి తలాంతులను, శక్తిని ఉపయోగించి సేవ చేసేవారిని. మన సమాజంలో క్రీస్తు శరీరం అంతా చురుకుగా ఉండడం చూడాలని మన ఆశ.

7. **దేవుడు స్తుతించబడునట్లు చేయాలి**

మనం చేసిన కార్యం తర్వాత మహిమ దేవునికే చెల్లాలి అనేది మనం కోరేది.

ఇప్పుడు మీ సమాజాన్ని మార్చడానికి ఆలోచనలు అని మనం పాఠం 4లో రాసిన జాబితాను చూడండి.

## ప్రార్థించండి

ఆ మార్పులలో ఒకటి నిజం కావడానికి దాన్ని ఎలా ఆరంభించాలి అనే విషయమై ఒక బృందంగా ప్రార్థించండి. దేవుని స్వరం వినడానికి సమయం తీసుకుని, ఆయన మీకు చూపినది ఇతరులకు చెప్పండి.

## మీ ప్రణాళిక తయారుచేసుకోండి

మీ ***విద్యార్థి సహకారి***లోని ప్రేమపూర్వక కార్యాల ప్రణాళికను సమీక్షించండి. తరువాత ఒక మార్పును ఎంచుకుని, దాన్ని నెరవేర్చడానికి కలసి ప్రేమగల కార్యాన్ని ప్రణాళిక చేయండి.

# ప్రేమపూర్వక కార్యం చేసే ప్రణాళిక దశలు

## దశ 1: ప్రార్థించు

మొదటిగా చేయాల్సింది ప్రార్థన. ఇప్పుడు ప్రార్థించడానికి సమయం తీసుకోండి. మీ ప్రేమపూర్వక కార్యానికి మీరు ఏమి చేయాలో చూపమని దేవుని అడగండి. దేవుని స్వరాన్ని వినడానికి తప్పకుండా కొన్ని నిమిషాల సమయం నిశ్శబ్దంగా కనిపెట్టండి.

## దశ 2: ఒక కార్యాన్ని ఎంచుకోండి

ఒక బృందంగా, మీరు చేయగల ఒక ప్రేమగల కార్యం నిర్ణయించుకోండి. దేవుడు ఎలాంటి ప్రేరణనైనా ఇస్తున్నాడా? ఒక మంచి ప్రేమగల కార్యం ఏదో ఎవరికైనా ఆలోచనలు ఉన్నాయా, చెప్పమని అడగండి. పాఠం 5లో (సంఘం సహాయం చేయాలని దేవుడు కోరుతున్నాడు), పాఠం 6లో (మీరు సహాయం చేయగల కొన్ని అవసరతలు) మీరు రాసిన కొన్ని ఆలోచనలు కూడా చూడండి. దేవుడు మిమ్మల్ని ఏమి చేయడానికి నడిపిస్తున్నాడని మీరు భావిస్తున్నారో కలసి ఏకీభవించండి.

మీరు ఒక అంశాన్ని ఎంచుకున్న తర్వాత, మీరు దాన్ని ఒక్కరోజులోనే చేయగలిగేది ఉండేటట్లు చూచుకోండి. కొన్ని బృందాలు మరీ పెద్ద పనులు ఎంచుకుంటారు. మీరు ఒక్కరోజులో, స్థానిక వనరులతో, సాధ్యమైనంత మంది ప్రజలు పాల్గొనేటట్లు చేసే విషయాన్ని గూర్చి ఆలోచిస్తూ ఉండండి.

***బోధకునికి సూచనలు**: మీరు చిన్న బృందాలలో ప్రణాళికలు చేస్తుంటే, ప్రతి బృందం తమ ఆలోచనను చెప్పడానికి అవకాశం ఇచ్చి, మిగిలినవారు దానిగూర్చి ఏమి చెబుతారో వినండి.*

- అది ప్రేమను కనుపరస్తుందా?
- అది సామాన్యమైనది, చిన్నదేనా?
- అది మీకు అందుబాటులో ఉన్న వనరులతో చేయగలరా?
- దానిలో సాధ్యమైనంత ఎక్కువమంది పాల్గొనేటట్లు ఉందా?

## దశ 3: ఒక ప్రణాళిక సిద్ధం చేయండి

క్రింద ఇచ్చిన ప్రశ్నలు చర్చించండి. సాధ్యమైతే, మీరు మర్చిపోకుండా ఉండేటట్లు వీటికి జవాబులను ఎవరిచేతనైనా రాయించండి.

- మీరేమి చేయబోతున్నారు?
- మీకు అవసరమయ్యే వనరులు ఏమిటి? అవి మీకు ఎక్కడ దొరుకుతాయి? ఎవరు వాటిని తెస్తారు?
- మీరు ఎవరికి సహాయం చేయబోతున్నారు?
- సహాయం చేయడంలో ఎవరు పాల్గొంటారు? అందర్నీ ఆహ్వానించేవారు ఎవరు?
- ఏ రోజున అది మీరు చేయబోతున్నారు?

***బోధకునికి సూచనలు**: ఒకవేళ క్లాసు చిన్న బృందాలుగా పని చేస్తుంటే, ప్రతి బృందం వారి ప్రణాళికను చెప్పడానికి అవకాశం ఇవ్వండి. ఆ ప్రణాళికలను బలపరచడానికి బృందంలో ఎవరైనా సూచనలు ఇస్తారేమో అడగండి.*

### దశ 4: ప్రార్థించండి

మీరు ప్రణాళిక రాయడం ముగించిన తర్వాత, మరలా ప్రార్థించడానికి సమయం తీసుకోండి. ఆ కార్యక్రమాన్ని పూర్తి చేయడానికి సహాయం చేయమని దేవుని అడిగి, ఫలితాలను అత్యధికం చేయమని ప్రార్థించండి. ఆయన నామం మహిమపరచబడునట్లు ప్రార్థించండి. మీరు మీ కార్యక్రమానికి సిద్ధపడుతుండగా, వచ్చే వారం రెండు వారాల్లో, దేవుడు మీకు ఆ కార్యక్రమంలో సహాయం చేయాలని మీరు ప్రార్థిస్తూ ఉండాలి.

***బోధకునికి సూచనలు**: మరొక రెండు దశలు ఉన్నాయి కాని వాటిని మనం ఈ రోజు చేయడం లేదు అని బృ:ందానికి వివరించండి. తరువాత మిగిలిన రెండు దశల వివరణను చదవండి.*

### దశ 5: ప్రాజెక్టు/కార్యక్రమం చేయండి

తరువాత దశ మీరు ప్రణాళిక చేసిన కార్యక్రమాన్ని చేయడం. ప్రార్థనతో ఆ రోజును ఆరంభించి, మీ ప్రయత్నాలను దేవునికి అంకితం చేయండి. మీ సమాజానికి దేవుని ప్రేమను కనుపరచడానికి మీరు ఈ కార్యక్రమం చేస్తున్నారని గుర్తుంచుకోండి. ఈ లక్ష్యానికి సరిపోలే వైఖరిని చూపడానికి ప్రయత్నించండి.

### దశ 6: అంచనా వేసి/పరీక్షించి, నివేదించండి

చివరి దశ నివేదన చేసి మూల్యాంకనం/అంచనా వేయడం. ఎందుకు మనం పరీక్షించుకోవాలి? ఎందుకంటే మనం నేర్చుకోవడానికి అది సహాయం చేస్తుంది. మనం ఏది బాగా చేసామో ఆలోచించవచ్చు, ఇంకా వచ్చేసారి దేనిని మెరుగుగా చేయగలమో తెలుసుకోవచ్చు.

అది సుదీర్ఘమైన ప్రక్రియ కానవసరం లేదు. ఈ ప్రశ్నలను కొద్ది నిమిషాలు తీసుకుని చర్చిస్తే చాలు:

- ఏది బాగా జరిగింది?
- ఏది బాగా జరగలేదు?
- మీ ప్రణాళికలో దేనిని మీరు మెరుగుచేయగలరు?
- స్పందన మీరు ఉద్దేశించినట్లుగా ఉందా? లేకుంటే, ఎందుకు లేదు?
- దేవుడు మహిమపరచబడ్డాడా?

### ప్రార్థన

***బోధకునికి సూచనలు**: ప్రార్థనతో ముగించండి ' పెద్ద బృందంతో, చిన్న బృందాలతో లేక సమయం ఉంటే భాగస్వామితో కలసి ప్రార్థించండి.*